RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

**నీలగిరి నిత్యపద్యం**

ఆటవెలది

మనము నచ్చనపుడు మౌనము మంచిది
తనము నచ్చనపుడు దవ్వుమేలు
కూర్మి నచ్చనపుడు సర్వమ్ము వదులుము
విజయలక్ష్మి వినుర నరుడ

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి

**విలేకరులు కావలెను**

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా
WHATS APP నంబర్:-
9705770909 సంప్రదించండి.

సంచిక : 342 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | గురువారం | 09-04 -2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00

## 2 వారాలు కాల్పుల విరమణకు ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్ అంగీకారం

# సీజ్‌ఫైర్

- యుద్ధానికి తాత్కాలిక బ్రేక్!
- రెండు వారాలు కాల్పుల విరమణ !
- 10న ఇస్లామాబాద్‌లో ప్రత్యక్ష చర్చలు
- 10 షరతులు విధించిన ఇరాన్
- స్వాగతించిన యుఎన్, రష్యా

వాషింగ్టన్, టెహరాన్ : ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
గత నెల రోజులకు పైగా ప్రపంచ దేశాలను వణికించిన పశ్చిమాసియా యుద్ధానికి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రెండు వారాల పాటు ఇరాన్‌పై బాండు దాడులను నిలిపివేస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మంగళవారం ప్రకటించారు. ఇరాన్ పంపిన 10 పాయింట్ల ప్రతిపాదన ప్రాతిపదికన ఇరాన్‌తో ప్రత్యక్ష చర్చలు ఈ నెల 10న ప్రారంభమవుతాయని ప్రకటించారు.

-మిగతా 2 లో




### లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్


- 1982 తర్వాత ఇదే అతి పెద్ద దాడి
- 200 మందికి పైగా పౌరుల దుర్మరణం
- క్షతగాత్రులతో నిండిన దవాఖానలు
- లెబనాన్‌కు 'సీజ్ ఫైర్' వర్తించదన్న ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు
- సీజ్ ఫైర్ డీల్ జరిగినా ఆగని దాడులు
- ఇరాన్‌లోని ఆయిల్ రిఫైనరీపై బాంబులు
- గల్ఫ్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్

2









### గెలుపు ముంగిట ఢిల్లీ బోల్తా

- ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ బోణీ
- ఉత్కంఠ పోరులో ఢిల్లీపై 1 రన్ తేడాతో విక్టరీ
- ఈ సీజన్‌లో తొలి ఓటమి చవిచూసిన ఢిల్లీ

న్యూఢిల్లీ,
ఐపీఎల్ 2026లో గుజరాత్ టైటాన్స్ బోణీ కొట్టింది. బుధవారం చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన మ్యాచులో ఆ జట్టు.. ఢిల్లీ క్యాపిటల్స్‌ను ఒక్క పరుగు తేడాతో ఓడించింది. చివరి బంతికి ఢిల్లీ విజయానికి 2 రన్స్ అవసరం కాగా.. ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బంతి వేశాడు. స్ట్రైకింగ్‌లో డేవిడ్ మిల్లర్ ఉన్నా.. రన్ కొట్టలేకపోయాడు. అయినా పరుగు కోసం ప్రయత్నించగా.. వికెట్ కీపర్ జోస్ బట్లర్ బంతితో నేరుగా వికెట్లను కొట్టడంతో కుల్‌దీప్ యాదవ్ రనౌట్ అయ్యాడు. దీంతో గుజరాత్ టైటాన్స్ గెలుపొందింది.211 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఓపెనర్లు కేఎల్ రాహుల్, పథుమ్ నిస్సాంక అదిరే ఆరంభం ఇచ్చారు. వీరిద్దరూ తొలి వికెట్‌కు 8 ఓవర్లలో 76 పరుగులు జోడించారు. దీంతో ఢిల్లీ క్యాపిటల్స్ విజయంపై ధీమాగా ఉంది. కానీ నిస్సాంక (41)ను ఔట్ చేసిన ప్రసిద్ధ్ కృష్ణ.. గుజరాత్‌ను పోటీలోకి తెచ్చాడు.

-మిగతా 2 లో

## సీఎస్ఆర్ నిధుల్ని స్థానికంగానే వినియోగించండి

**ఖర్చుగా కాదు... భాగస్వామ్యంగా చూడండి....**

- ఏ రంగంలో ఖర్చు చేయాలో మీరే నిర్ణయించుకోండి
- సమన్వయం కోసం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నియామకం
- కంపెనీల ప్రతినిధులతో సీఎం సమీక్ష

హైదరాబాద్ ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల వినియోగంపై ఇప్పటి వరకు రాష్ట్రంలో సంపూర్ణ విధానమే లేదని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి తెలిపారు. అందువల్లే కంపెనీలను సమన్వయం చేసుకొనేందుకు ప్రభుత్వం తరఫున ప్రత్యేక ప్రధాన కార్యదర్శిని నియమించామన్నారు. ఎక్కడి సంస్థలు ఆ ప్రాంతాల్లోనే సీఎస్ఆర్ నిధుల్ని ఖర్చు చేస్తే ఫలితాలు మెరుగ్గా ఉంటాయని తెలిపారు. దీనికి సంబంధించిన ప్రాధాన్య రంగాలను వారే ఎంచుకోవాలని చెప్పారు.

-మిగతా 2 లో





### దంచికొడుతున్న ఎండలు

- 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా..
- ఖమ్మం జిల్లాలో అత్యధికంగా 41.6
- హైదరాబాద్ వాతావరణ కేంద్రం

హైదరాబాద్,
రాష్ట్రవ్యాప్తంగా ఎండలు దంచికొడుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. దీంతో జనం బయటకు రావాలనే జంకుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ వాతావరణ కేంద్రం ఒక ప్రకటన విడుదల చేసింది. రెండు ఆవర్తన ద్రోణుల ప్రభావంతో వచ్చే వారంపాటు పొడి వాతావరణం నెలకొంటుందని పేర్కొన్నది. బుధవారం రాష్ట్రంలోని 20 జిల్లాల్లో 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని తెలిపింది.దీంతో ఆయా జిల్లాలకు

-మిగతా 2 లో

### 3 అసెంబ్లీలకు నేడు ఎన్నికలు

- కేరళ, అస్సాం, పుదుచ్చేరికి ఒకే విడతలో పోలింగ్
- అన్ని ఏర్పాట్లు పూర్తి
- మే 4న ఫలితాలు



న్యూఢిల్లీ,
అస్సాం, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల సంగ్రామం తుది అంకానికి చేరుకుంది. గురువారం రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో ఒకే దశలో చేపడుతున్న పోలింగ్‌లో.. దాదాపు 5.3 కోట్లమంది ఓటర్లు ఆయా పార్టీల భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. అస్సాంలో ద్విముఖ పోరు, కేరళలో సైద్ధాంతిక పోరు,

-మిగతా 2 లో

### యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు

- పశ్చిమాసియా ఘర్షణలతో ప్రతికూలతే :
- ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన
- కీలక వడ్డీరేట్లు యథాతథం



ముంబయి
పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపబోతున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ సంజయ్ మల్హోత్రా ఆందోళన వ్యక్తం చేశారు.

-మిగతా 2 లో

### చర్చలతోనే శాంతి స్థాపన

- కాల్పుల విరమణను స్వాగతించిన భారత్



న్యూఢిల్లీ
అమెరికా–ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ బుధవారం స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతిని నెలకొల్పేందుకు 'ఉద్రిక్తతల తగ్గింపు, చర్చలు, దౌత్యం' అవసరమని పిలుపునిచ్చింది. కాల్పుల విరమణ సమయంలో హొర్ముజ్

-మిగతా 2 లో

## మోటర్లపైనా కాంగ్రెస్ కుట్ర!

- పంప్‌హౌస్‌ల నిర్వహణ గాలికి
- పెద్ద మోటర్ల నిర్వహణ అశాస్త్రీయం
- మరమ్మతులకు వస్తే బీఆర్ఎస్‌పై నెపం మోపేందుకు సర్కార్ కుయుక్తి
- మాజీ మంత్రి హరీశ్‌రావు ధ్వజం
- ఇరిగేషన్‌శాఖ మంత్రికి లేఖ



హైదరాబాద్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాలకు సంబంధించిన మోటర్లపైనా కుట్రలకు పాల్పడుతున్నదని, కాళేశ్వరం, దేవాదుల ప్రా జెక్టులను ఇష్టారీతిన నిర్వహిస్తున్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. నిబంధనలకు విరుద్ధంగా పదే పదే ఆన్, ఆఫ్ చేస్తున్నదని ధ్వజమెత్తారు. ప్రాజెక్టుల్లోని భారీ మోటర్లను నిబంధనలకు విరుద్ధంగా అశాస్త్రీయంగా నిర్వహిస్తున్నదని మండిపడ్డారు.

-మిగతా 2 లో

## ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

- కోవిడ్ వంటి కష్ట సమయాల్లో మెరుగైన వైద్య సేవలు
- డాక్టర్ల న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరిస్తాం
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ
- కోఠిలో తెలంగాణ వైద్య భవన్ ప్రారంభం




సుల్తాన్ బజార్ ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
ప్రభుత్వ డాక్టర్లు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నారని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్ కోఠిలోని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం తెలంగాణ వైద్య భవన్‌ను బుధవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యులు కోవిడ్ వంటి కష్ట సమయంలో వారు అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రజలకు సేవలందించే డాక్టర్లకు

-మిగతా 2 లో

# దంచికొడుతున్న ఎండలు

మొదటి తరువాయి

ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినట్టు తెలిపింది. వచ్చే మూడ్రోజులు ఉష్ణోగ్రతలు 2 నుంచి 3 డిగ్రీలు పెరుగుతాయని వెల్లడించింది. గతేడాదితో పోలిస్తే అన్ని జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని వివరించింది. ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెంలో అత్యధికంగా 41.6 డిగ్రీలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దుమ్ముగూడెంలో 41.5, నల్లగొండ జిల్లా నేరడుగొమ్మలో 41.5, సూర్యాపేట జిల్లా మేళ్లచెర్వులో 41.4, జనగామ జిల్లా పాలకుర్తిలో 41.2, వరంగల్ జిల్లా సంగెంలో 41.2, హైదరాబాద్‌లో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది. ప్రజలు బయటకు వెళ్లే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

# గెలుపు ముంగిట ఢిల్లీ బోల్తా

మొదటి తరువాయి

నితీశ్ రాణా (5), సమీర్ రిజ్వీ (0) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. మ్యాచ్ గెలిపించేలా కనిపించిన కేఎల్ రాహుల్ (52 బంతుల్లో 92 రన్స్) చివర్లో ఔట్ అయ్యాడు.గాయం కారణంగా తొలుత మైదానాన్ని వీడిన డేవిడ్ మిల్లర్.. ఆ తర్వాత జట్టు కష్టాల్లో ఉందన బ్యాటింగ్‌కు వచ్చాడు. ధనాధన్ షాట్లతో ఢిల్లీని విజయానికి చేరువచేశాడు. డీసీ చివరి బంతికి 2 రన్స్ అవసరం కాగా.. మిల్లర్ బంతిని హిట్ చేయలేకపోయాడు. వికెట్ కీపర్ బట్లర్.. బంతిని నేరుగా వికెట్లకు కొట్టడంతో ఢిల్లీ ఒక్క రన్ తేడాతో ఓడిపోయింది. డేవిడ్ మిల్లర్ 20 బంతుల్లో 41 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. ఈ టోర్నీలో ఢిల్లీకి ఇదే తొలి ఓటమి కాగా.. గుజరాత్‌కు ఇదే తొలి విజయం. అంతకుముందు టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ టైటాన్స్ భారీ స్కోరు చేసింది. ఫిట్‌నెస్ సమస్యలతో గత మ్యాచుకు దూరమైన కెప్టెన్ శుభ్‌మన్ గిల్.. రీఎంట్రీతో అదరగొట్టాడు. 45 బంతుల్లో 70 రన్స్ చేశాడు. జోస్ బట్లర్ 27 బంతుల్లో 52 రన్స్, వాషింగ్టన్ సుందర్ 32 బంతుల్లో 55 రన్స్ చేయడంతో నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 210 పరుగులు చేసింది.

# చర్చలతోనే శాంతి స్థాపన

మొదటి తరువాయి

జలసంధి గుండా వాణిజ్య నౌకల ప్రయాణానికి ఎలాంటి ఆటంకాలు కలుగవని తాము భావిస్తున్నట్టు తెలిపింది.ఈ మేరకు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. చర్చలు, దౌత్యం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భారత్ మొదటి నుంచీ ఇరు దేశాలకు చెప్తూనే ఉంది. పశ్చిమాసియా ఉద్రిక్తతల వల్ల ముడి చమురు, సీఎన్‌జీ వంటి ఉత్పత్తుల రవాణాకు ఆటంకం ఏర్పడటంతో భారత్ సహా చాలా దేశాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నాయి.

# యుద్ధంతో భారత వృద్ధికి ముప్పు

మొదటి తరువాయి

ఆర్బీఐ మానిటరీ పాలసీ కమిటీ (ఎంపీజీ) సమావేశం అనంతరం బుధవారం గవర్నర్ మీడియాతో మాట్లాడుతూ.. యుద్ధం వల్ల తలెత్తే పరిణామాలను ప్రస్తావించారు. అమెరికా-ఇరాన్ మధ్య ఘర్షణ వాతావరణం అంతర్జాతీయంగా అనిశ్చితిని పెంచిందన్నారు. ఇది భారత వృద్ధికి సవాలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. గతంలో దేశీయ ఆర్థిక పునాదులు పటిష్టంగా ఉన్నప్పటికీ మార్చి నెలలో యుద్ధ తీవ్రత పెరగడంతో పరిస్థితులు ప్రతికూలంగా మారాయని ఆయన విశ్లేషించారు. ముడిచమురు ధరలు పెరగడం వల్ల దిగుమతి ద్రవ్యోల్బణం పెరగడమే కాకుండా, కరెంట్ అకౌంట్ లోటు (సీఏడీ) మరింత విస్తరించే ప్రమాదం ఉందన్నారు.

**రెపోరేటు 5.25 శాతమే..**

అధిక వ్యయాలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రుణగ్రహీతలు వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆశించిన వారికి ఆర్‌బిఐ నిర్ణయం నిరాశకు గురి చేసింది. 2026-27 ఆర్థిక సంవత్సరపు తొలి సమీక్షలో రెపో రేటును 5.25 శాతం వద్దే యధాతథంగా ఉంచుతూ నిర్ణయం తీసుకుంది. గతేడాది ఫిబ్రవరి ఫిబ్రవరి నుంచి దాదాపు 1.25 శాతం మేర రేట్లను తగ్గించిన ఆర్‌బిఐ ఈసారి మాత్రం ఎలాంటి మార్పులు చేయలేదు. ఈ నిర్ణయం వల్ల బ్యాంకుల వద్ద వడ్డీ రేట్లు స్థిరంగా ఉండటమే కాకుండా పారిశ్రామిక వృద్ధికి, సామాన్యుల ఇఎంఐలపై భారం పడకుండా దోహదపడుతుందని గవర్నర్ పేర్కొన్నారు.

**డిమాండ్‌కు విఘాతం..**

పశ్చిమాసియా యుద్ధం వల్ల సరఫరా వ్యవస్థలో తలెత్తే అడ్డంకులు దేశంలోని పరిశ్రమలు, వ్యవసాయం, సేవా రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతాయని గవర్నర్ మల్హోత్రా వివరించారు. ముఖ్యంగా హోర్ముజ్ జలసంధిలో రవాణా ఆటంకాల వల్ల ముడివస్తువుల లభ్యత తగ్గి, దేశీయ ఉత్పత్తి క్షీణించవచ్చని హెచ్చరించారు. ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తే భారత ఎగుమతులు, రెమిటెన్స్‌ల ప్రవాహంపై ప్రభావం పడుతుందన్నారు. ఇది చివరకు దేశీయంగా అప్పుల భారాన్ని కూడా పెంచవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. "సరఫరా వ్యవస్థలో మొదలైన అడ్డంకులు పునరుద్ధరణలో ఆలస్యమైతే.. అది మధ్యకాలికంగా డిమాండ్ పడిపోవడానికి దారితీయవచ్చు" అని మల్హోత్రా హెచ్చరించారు.

# ప్రభుత్వ వైద్యుల సేవలు మరువలేనివి

మొదటి తరువాయి

అవసరమైన సదుపాయాలను ప్రభుత్వం సమకూరుస్తుందని తెలిపారు. దశాబ్దాలుగా వైద్యులు కోరుతున్న తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను డైరెక్టరేట్ ఆఫ్ సెకండరీ హెల్త్ కేర్‌గా మార్చినట్టు వెల్లడించారు. గోషామహల్‌లో సుమారు 26 ఎకరాల్లో రూ.3000 కోట్లతో అత్యాధునిక ఉస్మానియా ఆస్పత్రి నిర్మాణం చేపట్టామని చెప్పారు. ఇది రాష్ట్ర ఆరోగ్య రంగంలో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు. రెండేండ్లలో ఆరోగ్యశాఖలో 10,327 నియామకాలు పూర్తి చేసినట్టు తెలిపారు. మరో 6,000కి పైగా పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందని చెప్పారు. ఇటీవల 174 అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 692 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులకు నియామక ఉత్తర్వులు జారీ చేసినట్టు వివరించారు. భవిష్యత్‌లో డాక్టర్లకు మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. డీపీహెచ్, టీవీవీపీలో పనిచేస్తున్న స్పెషలిస్టులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు అవకాశాలు కల్పించినట్టు తెలిపారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం పెంచినట్టు చెప్పారు. ట్రాన్స్‌ఫర్లను పారదర్శకంగా నిర్వహిస్తూ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగ్స్ ఇస్తున్నామని తెలిపారు. అయితే, ప్రతి ఒక్కరూ హైదరాబాద్‌లోనే పోస్టింగ్ కోరడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ట్రాన్స్‌ఫర్లు, డిప్యుటేషన్ల పేరుతో వైద్య సేవలకు అంతరాయం కలిగించొద్దని సూచించారు.

# సీజ్‌ఫైర్..

మొదటి తరువాయి



అయితే హోర్ముజ్ జలసంధిని తెరవాలన్న షరతుకు లోబడే ఈ చర్చలు జరుగుతాయని ట్రంప్ స్పష్టం చేశారు. ఇది తాము సాధించిన విజయంగా ట్రంప్ చెప్పుకున్నారు. మరోవైపు ఇరాన్ కూడా తన వైఖరిని స్పష్టం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు తమపై దాడులు నిలిపివేసినట్లైతే, తాము కూడా దాడులను ఆపుతామని ప్రకటించింది. తమ సాయుధ బలగాల సమన్వ యంతోనే హోర్ముజ్‌లో నౌకల రవాణా కొనసాగు తుందని తెలిపింది. ఇది ఇరాన్ సాధించిన దౌత్య విజయం అని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇరాన్ విదేశాంగ మంత్రి అరగ్చి ఒక ప్రకటన విడుదల చేశారు. లెబనాన్‌తో సహా అన్ని రంగాల్లో తక్షణమే కాల్పుల విరమణ జరిపేందుకు అన్ని పక్షాలు, వాటి మిత్రపక్షాలు అంగీకరించాయని పాకిస్తాన్ వెల్లడించింది. ఇరు పక్షాల మధ్య కాల్పుల విరమణ కోసం ఇప్పటివరకు మధ్యవర్తిత్వం నెరిపిన పాకిస్తాన్ ఈ నెల 10న జరిగే ప్రత్యక్ష చర్చలకు ఆతిథ్యం ఇవ్వనున్నట్ల ప్రకటించింది. శుక్రవారం ఇరు పక్షాలు ప్రత్యక్ష చర్చల కోసం ఇస్లామాబాద్‌కు రావాల్సిందిగా ప్రధాని షరీఫ్ ఆహ్వానించారు. లెబనాన్‌తో సహా అన్ని చోట్లా తక్షణమే కాల్పుల విరమణ అమల్లోకి వస్తుందని ఆయన సోషల్ మీడియా పోస్టులో పేర్కొన్నారు.

**90 నిముషాలు ముందుగా...**


హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్‌కు విధించిన గడువు ముగియడానికి కేవలం 90నిముషాలు ముందుగా ట్రంప్ ప్రకటన వెలువడింది. ఇరాన్ గనక తమ ఒప్పందానికి ఆమోదించని పక్షంలో ఇరాన్ నాగరితకను ఒక రాత్రిలోగా నాశనం చేస్తామంటూ ట్రంప్ పదే పదే హెచ్చరికలు జారీ చేశారు. ఆ తరుణంలో చిట్టచివరి నిముషంలో పాకిస్తాన్ అందచేసిన ఇరాన్ ప్రతిపాదనతో ఇదంతా జరిగింది. ఇరాన్ ప్రతిపాదనల ప్రాతిపదికగా ఉభయ పక్షాలు చర్చలు జరపడానికి అంగీకారం కుదిరింది. "పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఫీల్డ్ మార్షల్ అసిమ్ మునీర్‌లతో జరిగిన సంభాషణల మేరకు, హోర్ముజ్ జలసంధిని తక్షణమే తెరిచి, నౌకలను సురక్షితంగా పంపేందుకు ఇరాన్ అంగీకరించినందున, ఇరాన్‌పై రెండు వారాల పాటు బాంబు దాడులు నిలిపివేయడానికి నేను అంగీకరిస్తున్నాను. ఇది ఉభయ పక్షాల కాల్పుల విరమణగా వుంటుంది." అని ట్రంప్ తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు.

# లెబనాన్‌పై విరుచుకుపడ్డ ఇజ్రాయెల్

**-1982 తర్వాత ఇదే అతి పెద్ద దాడి**
**-200 మందికి పైగా పౌరుల దుర్మరణం**
**-క్షతగాత్రులతో నిండిన దవాఖానలు**
**-లెబనాన్‌కు 'సీజ్ ఫైర్' వర్తించదన్న ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు**
**-సీజ్ ఫైర్ డీల్ జరిగినా ఆగని దాడులు**
**-ఇరాన్‌లోని ఆయిల్ రిఫైనరీపై బాంబులు**
**-గల్ఫ్ దేశాలపై విరుచుకుపడ్డ ఇరాన్**

న్యూఢిల్లీ/ :

అమెరికా-ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం (సీజ్ ఫైర్ డీల్) కుదిరినప్పటికీ.. పశ్చిమాసియాలో బుధవారం కూడా దాడులు కొనసాగాయి. లెబనాన్‌పై ఇజ్రాయెల్ విరుచుకుపడింది. 10 నిమిషాల వ్యవధిలోనే ఏకంగా 100 వైమానిక దాడులు జరిపింది. ఈ దాడుల్లో 200 మందికి పైగా మృత్యువాతపడగా.. 700 మంది క్షతగాత్రులయ్యారు. 1982 తర్వాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని అధికారులు తెలిపారు. మరోవైపు, ఇరాన్‌లోని ఓ చమురు శుద్ధి కేంద్రంపై దాడులు జరగ్గా..



దీనికి ప్రతిగా కువైట్, యూఏఈ, సౌదీ అరేబియా, బహ్రెయిన్‌పై ఇరాన్ డ్రోన్లతో విరుచుకుపడింది

భీతావహంగా లెబనాన్

లెబనాన్‌పై ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) భీకర దాడులు జరిపింది. బీరుట్, దక్షిణ లెబనాన్, బెకా నగరాలతో పాటు హెజ్బొల్లా ఉపయోగించే కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, స్థావరాలు, ఇతర మౌలిక సదుపాయాలే లక్ష్యంగా 10 నిమిషాల వ్యవధిలోనే 100 ఎయిర్‌స్ట్రైక్స్ చేసింది. ఈ భీకర దాడుల్లో 89 మంది ప్రజలు మృత్యువాతపడ్డారు. 700 మందికి పైగా క్షతగాత్రులయ్యారు. ఈ దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాధిక్ అలీ నబుల్సీ మృతి చెందారు. 1982 తర్వాత లెబనాన్‌పై జరిగిన అతిపెద్ద దాడి ఇదేనని అధికారులు తెలిపారు. దాడులు జరిగిన ప్రాంతాల్లో అంబులెన్సులు, వైద్య సిబ్బంది, పోలీసులు, అధికారులు సహాయక చర్యలు చేపట్టినట్టు రెడ్‌క్రాస్ వెల్లడించింది. క్షతగ్రాత్రులతో లెబనాన్‌లోని అన్ని దవాఖానలు నిండిపోయినట్టు ఆరోగ్యమంత్రి తెలిపారు.

మిత్ర దేశాలు సాయం చేయాలి

పౌర సమాజంలో హెజ్బొల్లా పాతుకుపోవడాన్ని లెబనాన్ ప్రభుత్వం, అక్కడి ప్రజలు వ్యతిరేకించాలని ఐడీఎఫ్ ఒక ప్రకటనలో తెలిపింది. లేకపోతే, ఇలాంటి పరిస్థితులు పునరావృతమవుతాయని హెచ్చరించింది. మరోవైపు, ఇజ్రాయెల్ దాడులను నిలుపుదల చేసేందుకు సాయం చేయాలని మిత్ర దేశాలకు లెబనాన్ ప్రధాని నవాఫ్ సాలమ్ విజ్ఞప్తి చేశారు. ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాము స్వాగతిస్తున్నామన్న సాలమ్.. తాము కూడా ఈ ఒప్పందంలో భాగమైనట్టు తెలిపారు. అయినప్పటికీ, ఇజ్రాయెల్ ఇలా విరుచుకుపడటమేంటని ప్రశ్నించారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడులపై హెజ్బొల్లా ఇంకా స్పందించలేదు.

# సీఎస్ఆర్ నిధుల్ని స్థానికంగానే వినియోగించండి

మొదటి తరువాయి

దీనికోసం ప్రభుత్వం తరఫున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామన్నారు. సీఎస్ఆర్ నిధులను ఖర్చుగా కాకుండా, అభివృద్ధిలో భాగస్వామ్యంగా చూడాలని కోరారు. సీఎస్ఆర్ నిధులకు సంబంధించి వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి బుధవారం సమావేశమయ్యారు. సీఎస్ఆర్ నిధుల ద్వారా ప్రభుత్వ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్ని సమీక్షించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్య రంగాలను కంపెనీల ప్రతినిధులకు వివరించారు. విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణ, నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. వీటితో పాటు కంపెనీలు తమకు ఇష్టమైన ఏ రంగాన్నైనా ఎంచుకొని సీఎస్ఆర్ నిధులు వినియోగించాలని కోరారు. ప్రభుత్వంతో పాటు కంపెనీలు సీఎస్ఆర్ నిధుల ద్వారా చేసే ఖర్చుల వల్ల రాష్ట్రంలోని విద్యార్థులు ప్రపంచ స్థాయి నైపుణ్యంగలవారిగా తీర్చిదిద్దబడతారని తెలిపారు. విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామన్నారు. రాష్ట్రంలోని విద్యార్థుల సంఖ్యలో హైదరాబాద్ నగరంలోనే 44 శాతం ఉన్నారనీ, వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. కంపెనీలు స్థానికంగా ఉన్న అన్ని మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ మొత్తాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలన్నారు. ఇప్పటికే రహేజా గ్రూప్ రూ.50 కోట్లు, రాంకీ గ్రూప్ రూ.50 కోట్లు, యశోద ఫౌండేషన్ రూ.10 కోట్లు విద్యాభివృద్ధికి కేటాయించేందుకు ముందుకు వచ్చాయంటూ వారికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కంపెనీల ప్రతినిధులు స్పందిస్తూ సీఎస్ఆర్ నిధుల విషయంలో ఇప్పటి వరకు ఇలా ఎవరూ తమను సంప్రదించలేదని తెలిపారు. ఈ విషయంలో చొరవ తీసుకున్నందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అభినందనలు తెలిపారు. పాఠశాల విద్యా, ఆస్పత్రులు, వారసత్వ కట్టడాల పరిరక్షణకు వారు ఆసక్తి చూపారు. సమావేశంలో శ్రావణ్‌కుమార్ (రహేజా ఫౌండేషన్), దాక్షయణి ఆళ్ల (రాంకీ ఫౌండేషన్), డాక్టర్ గోరుకంటి సురేందర్‌రావు, గోరుకంటి ఫల్గుణ్ రావు (యశోద ఆస్పత్రి), సుధారెడ్డి (మేఘా), అపర్ణారెడి (అపోలో ఆస్పత్రి), కామినేని భాస్కర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి (ఇండియన్ గ్రీన్ బిల్డింగ్ కౌన్సిల్), పగిడిపాటి దేవయ్య, రుద్రమదేవి (నాదం ఫౌండేషన్), ఎంపీ వేం నరేందర్‌రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా, విద్యాశాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేశ్ ధోత్రే, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ తదితరులు పాల్గొన్నారు.

# మోటర్లపైనా కాంగ్రెస్ కుట్ర!

మొదటి తరువాయి

'పంపులు, మో టర్లు పాడయ్యేలా కావాలనే ఈ కుట్ర జరుగుతున్నదా? ఆ నెపాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వంపై నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారా?' అంటూ నిప్పులు చెరిగారు. ఈ మేరకు రాష్ట్ర సాగునీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి బుధవారం బహిరంగ లేఖ రాశారు. పంప్‌హౌస్‌ల పనితీరుపై తీవ్ర ఆందోళన వ్య క్తం చేశారు.కీలకమైన లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుల్లోని అధిక సా మర్థ్యమున్న మోటర్లను పదేపదే ఆన్, ఆఫ్ చేస్తూ రన్ చేస్తున్న విష యం తెలు సా? అని మంత్రిని నిలదీశారు. అది ప్రాథమికంగా ఇంజినీరింగ్ డిజై న్ సూత్రాలకు విరుద్ధమని, తద్వారా పంపు లు, ఇంపెల్లర్లు, షియర్ పిన్‌లు, షాఫ్ట్‌లు, వా టికి సంబంధించిన ఎలక్ట్రో-మెకానికల్ సిస్టమ్‌లను క్రమంగా తీవ్రంగా దెబ్బతీస్తుందనే దానిపై అవగాహన ఉన్నదా? అని ప్రశ్నించా రు. పంపుల ఇన్‌స్టాలేషన్, కమిషనింగ్ సమయంలోనే నిరంతరాయం పనిచేసేలా సిస్టమ్‌లను ఏర్పాటు చేశారని, స్టార్ట్-స్టాప్ సైకిల్స్ కోసం కాదని సాంకేతిక నిపుణులు స్పష్టంగా తెలియజేశారని లేఖలో వివరించారు. అ లాంటి సిస్టమ్‌లో ప్రతి స్టార్టప్ తీవ్రమైన కంపనాలు, హైడ్రాలిక్ ట్రాన్సియెంట్స్, వాటర్ హామర్ ఎఫెక్ట్స్‌కు దారితీస్తాయని, ఆ పరిస్థితు ల్లో పదేపదే స్టార్ట్-స్టాప్ ఆపరేషన్లు చేయడం వల్ల ఇంపెల్లర్లు, షాఫ్ట్‌లు, బేరింగ్‌లు, షియర్ మెకానిజమ్‌పై అసాధారణ ఒత్తిడి పడుతుందని, ఆ పద్ధతి సాంకేతికంగా అత్యంత ప్రమాదకరమైందని వెల్లడించారు. ప్రస్తుతం ఇవేవీ పట్టించుకోకుండా పంపులను పదేపదే నడుపడం వల్ల మరమ్మతులకు గురయ్యే ప్రమా దం ఉన్నదని, కీలక మౌలిక వసతులు దీర్ఘకాలికంగా స్తంభిస్తాయని వెల్లడించారు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయని లేఖలో ప్రస్తావించారు. నిపుణులకు అవగాహన ఉన్నా, సాంకేతికంగా లోపభూయిష్టమైనదని తెలిసీ అనుమతిస్తున్నారా? లేక పరిపాలనా నిర్లక్ష్యం ఫలితమా? అని మంత్రి ఉత్తమ్‌ను ప్రశ్నించారు.

# 3 అసెంబ్లీలకు నేడు ఎన్నికలు

మొదటి తరువాయి

పుదుచ్చేరిలో బహుముఖ పోటీపై నేడు ఓటర్ల తీర్పు చెప్పనున్నారు. రెండు రాష్ట్రాలు, ఒక యూటీలో పోలింగ్ ఉదయం 7 గంటలకు మొదలుకానున్నది. వేలాదిగా ఏర్పాటుచేసిన పోలింగ్ బూత్‌ల వద్ద పెద్ద ఎత్తున భద్రతా బలగాలను మోహరించగా, వెబ్‌కాస్టింగ్ వంటి ఏర్పాట్లు జరిగాయి. మే 4న ఫలితాలు వెలువడనున్నాయి.

**కేరళలో హ్యాట్రిక్ విజయంపై విజయన్ కన్ను**

140 అసెంబ్లీ స్థానాలున్న దేవభూమి కేరళలో అధికార ఎల్డీఎఫ్, విపక్ష యూడీఎఫ్ మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. 883 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. విజయన్ సారథ్యంలోని ఎల్డీఎఫ్ వరుసగా మూడోసారి అధికారంలోకి రావాలని ఉవ్విళ్లూరుతున్నది. అయితే ప్రభుత్వ వ్యతిరేకత తమకు కలిసి వస్తుందని, రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్ ధీమా వ్యక్తం చేస్తున్నది. రాష్ట్రంలో ఇప్పటివరకు ఖాతా తెరువని కమలం పార్టీ.. ఈ సారి ఎలాగైనా ఉనికి చాటుకోవాలని తాపత్రయపడుతున్నది. మొత్తం ఓటర్లలో 1.32 కోట్ల మంది పురుషులు, 1.39 కోట్ల మంది మహిళలు ఉన్నారు.

**అస్సాం.. ఎవరి పక్షం?**

అస్సాంలో బీజేపీ-కాంగ్రెస్ కూటమి మధ్యే ప్రధాన పోటీ నెలకొన్నది. ఇక్కడ గౌరవ్ గొగోయ్ కాంగ్రెస్‌కు నేతృత్వం వహిస్తుండగా, సీఎం హిమంత నాయకత్వంలో బీజేపీ కూటమి మూడోసారి విజయంపై కన్నేసింది. 2016లో కాంగ్రెస్ అధికారాన్ని కోల్పోగా, ఈసారి విజయం కోసం 99 స్థానాల్లో తమ అభ్యర్థుల్ని బరిలోకి దింపింది. 126 అసెంబ్లీ స్థానాలున్న ఈ రాష్ట్రంలో ఓటర్లు 2.50 కోట్లమంది ఉండగా, దీంట్లో 1.25 కోట్ల మంది మహిళలు, 318 మంది థర్డ్ జెండర్ ఉన్నారు.

**పుదుచ్చేరిలో పాగా వేసేదెవరు?**

కేవలం 30 అసెంబ్లీ స్థానాలు.. దాదాపు 9.5 లక్షల మంది ఓటర్లు కలిగిన పుదుచ్చేరిలో పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. మొత్తం 294 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలబడ్డారు. రాష్ట్ర హోదా ప్రధాన అంశంగా ఈసారి పుదుచ్చేరి ఎన్నికల సంగ్రామం సాగింది. ఇక్కడ డబుల్ ఇంజిన్ సర్కార్ ఉన్నప్పటికీ పుదుచ్చేరిలో స్వతంత్ర పాలన లేదని కాంగ్రెస్-డీఎంకే కూటమి ఆరోపిస్తున్నది. విజయ్ రంగ ప్రవేశంతో ఈ సారి ఇక్కడ త్రిముఖ పోరు నెలకొన్నది.

# హిందూ సమ్మేళనాలను విజయవంతం చేయాలని పిలుపు

**కరీంనగర్/ మానకొండూర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: నగరంలోని కోతి రాంపూర్ గిద్దె పెరుమాండ్ల దేవాలయం ఆవరణలో ఈ నెల 17న జరగనున్న మహా హిందూ సమ్మేళనం ఏర్పాట్లు జోరుగా సాగుతున్నాయి. కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రాలు, కరపత్రాలను హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు మిర్యాల నరసింహారెడ్డి ఆధ్వర్యంలో బస్తీ ప్రముఖులు, కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి గిద్దె పెరుమాండ్ల స్వామి ఆశీస్సులు కోరారు. ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ కోతి రాంపూర్, కట్టరాంపూర్, పోచమ్మవాడ, అల్కాపూర్ కాలనీ ప్రాంతాల నుంచి హిందూ బంధువులు భారీగా హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమాజంలో కులాల పేరుతో విభజన




పెరుగుతున్న నేపథ్యంలో హిందువులు ఐక్యంగా నిలవాల్సిన అవసరం ఉందని, సనాతన ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దేశ అభివృద్ధితోనే సంప్రదాయాలు, సంస్కృతులు నిలుస్తాయని, విదేశీ ప్రభావాలను గుర్తించి సమాజాన్ని కాపాడేందుకు ఐక్యతే మార్గమని తెలిపారు. ఈ సమ్మేళనం ద్వారా హిందువుల మధ్య ఏకత్వ భావనను బలపరచడమే లక్ష్యమని అన్నారు. పచ్చునూర్ ఉప మండల శ్రీమానేటి రంగనాయక స్వామి హిందూ సమ్మేళనం నిర్వహణ కమిటీ ఏర్పాటుకు ఈ నెల 22న సభ జరగనుంది. పచ్చునూరు, ఊటూరు, వేగురుపల్లి, లక్ష్మీపూర్, వెల్ది గ్రామాల హిందూ బంధువులు కలిసి ఈ సభను నిర్వహించనున్నారు. హిందువులు అందరూ హాజరై సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని గ్రామాల హిందూ ధర్మ పరిరక్షకులు పిలుపునిచ్చారు. ఈ రెండు సభలు హిందూ ఐక్యతకు వేదికగా నిలవనున్నాయి.

# సన్న బియ్యం పంపిణీ పరిశీలించిన ఎంపీ గడ్డం వంశీకృష్ణ



**పెద్దపల్లి, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కొలనూరులో ప్రభుత్వం పేదలకు అందిస్తున్న సన్న బియ్యం పంపిణీ విధానాన్ని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ ఆకస్మికంగా పరిశీలించారు. రేషన్ దుకాణంలో నిల్వలు, పంపిణీ విధానం, బియ్యం నాణ్యతను స్వయంగా పరిశీలించి, రాబోయే మూడు నెలలకు సరిపడా నిల్వలు ఉన్నాయా అని డీలర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. పంపిణీ అవుతున్న బియ్యం పరిమాణం, నాణ్యతపై స్పష్టత తీసుకుని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సరఫరా చేయాలని సూచించారు. ప్రజలతో మాట్లాడి వారికి సకాలంలో బియ్యం అందుతోందా, డీలర్ ఎలాంటి ఇబ్బందులు పెడుతున్నాడా అనే అంశాలను తెలుసుకున్నారు. సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎంపీ స్వయంగా కొంతమంది లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేసి వారికి భరోసా కల్పించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు నిజంగా అర్హులకు చేరాలని, ఎలాంటి అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# శాతవాహన ఇంజినీరింగ్ కళాశాలకు భూమి కేటాయింపు

**హుస్నాబాద్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ ప్రాంతంలో విద్యా విస్తరణకు కీలక నిర్ణయం తీసుకోబడింది. ఉమ్మాపూర్ గ్రామ సమీపంలోని సర్వే నెంబర్ 132/1లో 36 గుంటల భూమిని శాతవాహన సాంకేతిక కళాశాల నిర్మాణం కోసం రెవిన్యూ అధికారులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ భూమిలో నూతన విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కళాశాల నిర్మాణం చేపట్టనున్నారు. ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడుతూ ఈ కళాశాల ద్వారా హుస్నాబాద్ మరియు పరిసర ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్య అందుబాటులోకి రానుందని తెలిపారు. విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని, స్థానిక యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఈ నిర్ణయం హుస్నాబాద్ ప్రాంత విద్యారంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలుకుతుందని, ప్రాంతీయ అభివృద్ధికి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య సతీష్ కుమార్ పాల్గొన్నారు.

# వడగండ్ల వానతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారాన్ని అందించాలని బిజెపి డిమాండ్

**సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేములవాడ నియోజకవర్గం కోనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ఇటీవల కురిసిన అకాల వడగళ్ల వాన కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పండిన వరి పంటలు నేలమట్టమవడంతో అన్నదాతలు తీవ్ర నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి గ్రామాన్ని సందర్శించి బాధిత రైతులను పరామర్శించారు. నష్టపోయిన పంటలను పరిశీలించి, రైతులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయ అధికారులను రంగంలోకి దింపి పంట నష్టాన్ని సమగ్రంగా అంచనా వేసి, ప్రతి రైతుకు తగిన నష్టపరిహారం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు విత్తనాలు,



ఎరువులు మరియు అవసరమైన సహాయాన్ని ప్రభుత్వం అందించాలని, భవిష్యత్తులో ఇలాంటి అకాల వాతావరణ పరిస్థితుల నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. బిజెపి ఎల్లప్పుడూ రైతుల పక్షాన నిలుస్తుందని, బాధిత రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి సిరికొండ శ్రీనివాస్, ధర్మారం గ్రామ సర్పంచ్, మండల అధ్యక్షుడు మీరాల్కర్ బాలాజీ, మాజీ జెడ్పిటిసి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, జిల్లా కౌన్సిల్ మెంబర్ గొట్టే రామచంద్రం, జిల్లా మరియు రాష్ట్ర పదాధికారులు, బిజెపి సీనియర్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై కఠిన చర్యలు




**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మానకొండూరు మండలం వెల్ది గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్ తన యజమాని తాళ్లపల్లి అనిల్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా బొమ్మకల్ వద్ద పోలీసులు పట్టుకున్నారు. అలాగే వల్లంపహాడ్ గ్రామానికి చెందిన బొజ్జం కుమార్, సంకూరి అనిల్ కుమార్ తమ యజమాని సంకరి శ్రవణ్ ఆదేశాల మేరకు అక్రమ ఇసుక రవాణా చేస్తుండగా పోలీసులు వల్లంపహాడ్ వద్ద పట్టుకున్నారు. ఈ ట్రాక్టర్లను సీజ్ చేసి, నిందితులపై కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

# గుంజపడుగు హరిప్రసాద్ సమక్షంలో జాగృతి భారీ చేరికలు

**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
జాగృతి మహిళా విభాగం జిల్లా నాయకురాలు బశెట్టి కృష్ణవేణి, రూపల ఆధ్వర్యంలో పలువురు మహిళా నాయకురాళ్లు తెలంగాణ జాగృతిలో చేరారు. వారికి జిల్లా జాగృతి అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ కండువా కప్పి ఆహ్వానించారు. చేరికల అనంతరం వారు మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో జాగృతి రోజురోజుకు బలోపేతం అవుతోందని, గ్రామస్థాయి నుండి స్వచ్ఛందంగా జాగృతిలో చేరి కవిత నాయకత్వాన్ని బలపరుస్తామని తెలిపారు. మహిళా నాయకురాళ్లు ముందుకు వచ్చి జాగృతిలో చేరడం ప్రజలకు కవిత నాయకత్వంపై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కవిత ప్రతిరోజూ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తోందని, రాష్ట్రంలో ప్రతిపక్ష పాత్రను జాగృతి మాత్రమే పోషిస్తోందని వారు అన్నారు. ప్రధాన ప్రతిపక్షం ప్రభుత్వానికి



తోడ్పాటుగా మారిందని, ఇతర పార్టీలు కూడా మద్దతు ఇస్తున్నాయని, ఈ పరిస్థితుల్లో ప్రజా సమస్యలపై పోరాడుతున్న ఏకైక శక్తి జాగృతేనని వారు స్పష్టం చేశారు. ఈనెల 25న కవిత నాయకత్వంలో రాష్ట్ర ప్రయోజనాలు, తెలంగాణ అస్తిత్వం కోసం జాగృతి ఒక తిరుగులేని రాజకీయ శక్తిగా రూపాంతరం చెందబోతోందని, ఆ సభకు పెద్ద ఎత్తున ప్రజలు హాజరుకానున్నారని తెలిపారు. కరీంనగర్ జిల్లా ప్రతి గ్రామం నుండి కూడా ప్రజలు ఆవిర్భావ సభలో పాల్గొనడానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. జాగృతి జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ రానున్న రోజుల్లో మహిళలు, యువత, బడుగు బలహీన వర్గాల సంక్షేమమే లక్ష్యంగా కవిత పనిచేస్తుందని, జాగృతి తెలంగాణ హక్కుల కోసం కృషి చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల తిరుపతి, మహిళా విభాగం అధ్యక్షురాలు హంకం శివరాణి, సీనియర్ నాయకులు రంగారవేణి లక్ష్మణ్, గాలిపల్లి రత్నాకర్ చారి, గర్శకుర్తి విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

**గంగాధర, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలోని మధురనగర్ ప్రజా కార్యాలయంలో అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు పంపిణీ



చేశారు. ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చొప్పదండి నియోజకవర్గంలోని 140 మంది అంగన్వాడీ టీచర్లకు స్మార్ట్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా శిశు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని, అంగన్వాడీ కేంద్రాల్లో సిబ్బంది హాజరు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఆన్లైన్‌లో నమోదు చేయడానికి స్మార్ట్‌ఫోన్లను సక్రమంగా వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గంగాధర ప్రాజెక్ట్ సిడిపివో సల్వాజి నర్సింగారాణి, తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, అంగన్వాడీ సూపర్వైజర్లు సంతోషి, రేణుక, సుధారాణి, మస్రత్, మిషన్ వాత్సల్య సామాజిక కార్యకర్త కవిత దేవి తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనల ప్రకారంఇందిరమ్మ ఇండ్లకు అనుమతులు ఇవ్వాలని బీఎస్పీ డిమాండ్

**హుస్నాబాద్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
హుస్నాబాద్ పట్టణంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు సంబంధించి అన్ని నిబంధనలు పాటిస్తూ మాత్రమే పర్మిషన్లు ఇవ్వాలని బీఎస్పీ హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి పచ్చిమట్ల రవీందర్ గౌడ్ కోరారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను పూర్తిగా పరిశీలించిన తర్వాతే లబ్ధిదారులకు అనుమతులు ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి, ఇందిరమ్మ హౌసింగ్ ఏఈలకు విజ్ఞప్తి చేశారు. 2020 తర్వాత లేఅవుట్ అనుమతి లేకుండా ఏర్పాటైన అనధికార వెంచర్లలో పర్మిషన్లు



ఇవ్వకూడదని ప్రభుత్వం స్పష్టమైన జీవో జారీ చేసిందని గుర్తు చేశారు. అలాంటి లేఅవుట్లలో ఇండ్లకు అనుమతులు ఇవ్వడం వల్ల ప్లాట్ యజమానుల మధ్య కొలతల తేడాలు, వివాదాలు తలెత్తే అవకాశముందని తెలిపారు. హుస్నాబాద్ పట్టణంలోని ఆరేపల్లి ప్రాంతంలో ఇదే సమస్యలు ఉన్నాయని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పేరిట రోడ్ల ఆక్రమణలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తూ, ప్లాట్ల కొలతల్లో తేడాలు ఉన్న చోట సర్వేయర్ ద్వారా హద్దులు స్పష్టంగా నిర్ణయించిన తర్వాతే అనుమతులు ఇవ్వాలని సూచించారు. సెట్‌బ్యాక్ నిబంధనలు పాటించకుండా ఇండ్లు నిర్మించడం వల్ల భవిష్యత్తులో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. నిబంధనలకు లోబడి మాత్రమే పర్మిషన్లు ఇవ్వాలని బీఎస్పీ పార్టీ తరఫున డిమాండ్ చేశారు.

# ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రైవేట్ ట్రావెల్స్‌లో ట్యాక్సీ కార్లు వినియోగించాలని నిరసన



**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రభుత్వ కార్యాలయాలు మరియు ప్రైవేట్ ట్రావెల్స్‌లో ట్యాక్సీ కార్లను వినియోగించాలని, పెట్రోల్, డీజిల్, సిఎన్జి గ్యాస్, టోల్‌గేట్ చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి, పబ్లిక్ ప్రైవేట్ రోడ్డు ట్రాన్స్పోర్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పున్నం రవి ఆధ్వర్యంలో తెలంగాణ గీతా భవన్ చౌరస్తా వద్ద నిరసన చేపట్టారు. వైట్ ప్లేట్ కార్ల ద్వారా కరీంనగర్ నుండి హైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, తిరుపతి, షిరిడి యాత్రలకు కిరాయిలు తిప్పడం వల్ల ట్యాక్సీ క్యాబ్ ఓనర్లు, డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్లకు 5 లక్షల ప్రమాద బీమా ఇవ్వాలని, వెంకటేశ్వర థియేటర్ బస్టాండ్ ముందు వైట్ ప్లేట్ కార్ల అడ్డాలను తొలగించాలని, ప్రభుత్వ శాఖలలో బినామీ డ్రైవర్ల పేర్లతో తిప్పుతున్న కార్లను కూడా వెంటనే తొలగించాలని కోరారు. వైట్ ప్లేట్ సెల్ఫ్ డ్రైవింగ్ కార్లు కిరాయిలకు ఇవ్వడం వల్ల ట్యాక్సీ ఓనర్లు, డ్రైవర్లు నష్టపోతున్నారని, రవాణా శాఖకు, ఆర్టీసీకి ఆదాయానికి గండి పడుతోందని ఆయన పేర్కొన్నారు. వైట్ ప్లేట్ కార్లపై రవాణా శాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో రవాణా శాఖ కార్యాలయం, ట్రావెల్స్ ముందు ధర్నాలు చేపడతామని హెచ్చరించారు. నగర అభివృద్ధిలో భాగంగా కళాభారతి ముందు ట్యాక్సీ స్టాండ్ ఏర్పాటు చేయాలని, ప్రజలు అవసరాల రీత్యా ట్యాక్సీ కార్లను వినియోగించాలని ఆయన సూచించారు. వైట్ ప్లేట్ కార్లలో ప్రమాదం జరిగినప్పుడు డ్రైవర్‌కు మాత్రమే ఇన్సూరెన్స్ ఉండగా, ట్యాక్సీ కార్లలో ప్రయాణికులందరికీ బీమా వర్తిస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో వంగల లక్ష్మారెడ్డి, ఎల్దండి చందు, గుంటుకు శ్రావణ్ కుమార్, నూనిగంటి రాజు, వీణవంక వరుణ్, మాతంగి రమేష్, మేకల శివకృష్ణ, వంగల యాదిరెడ్డి, నాచారం భాస్కర్, అజయ్, గసికంటి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# సముద్రాల ఉపసర్పంచ్‌పై ఆరోపణలు అవాస్తవమని ఖండన



**హుస్నాబాద్ , ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

సిద్దిపేట జిల్లా కోహెడ మండలం సముద్రాల గ్రామ ఉపసర్పంచ్ సింగరయ్యపై వేల్పుల బాలవ్వ చేసిన ఆరోపణలు అవాస్తవమని ఆయన స్పష్టం చేశారు. విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, గతంలో బాలవ్వ గ్రామ ఐక్య సంఘం తేజ వివోలో కార్యదర్శిగా పనిచేసిందని, అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికల్లో వార్డు మెంబర్‌గా పోటీ చేసి ఓడిపోయిన తర్వాత మళ్లీ కార్యదర్శి పదవిలో కొనసాగుతానని చెప్పడం సరైనది కాదని వివరించారు. గ్రామసభలో వివో కార్యదర్శి నియామకం గురించి ఎవరూ అడగలేదని, ఐకెపి అధికారులు వేరే వ్యక్తిని నియమించారని ఉపసర్పంచ్‌గా తాను మాత్రమే తెలియజేశానని అన్నారు. ఈ సమస్య వెనుక కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారని, తన ఎదుగుదలను జీర్ణించుకోలేక బాలవ్వను ఉపయోగిస్తున్నారని ఆరోపించారు. తన కుటుంబంలో మూడు ఉద్యోగాలు ఉన్నాయని ఆరోపించడం అసత్యమని, అధికారులను బెదిరించలేదని, తనపై వచ్చిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని ఖండించారు. సింగరయ్య మాట్లాడుతూ, ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తున్నానని, రాజకీయ ప్రయోజనాల కోసం తప్పుడు ప్రచారం జరుగుతోందని తెలిపారు.

# అంగన్వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు

- చిన్నారులకు యూనిఫామ్ పంపిణీ



**మిర్యాలగూడ, ఏప్రిల్ 8(నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు, చిన్నారులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో అర్బన్, రూరల్ ప్రాజెక్టు పరిధిలోని 194 మంది అంగన్వాడీ టీచర్లకు సెల్‌ఫోన్లు అందజేశారు. గర్భిణీలు, బాలింతలు, 6 నెలల నుండి 6 సంవత్సరాల వయసుగల చిన్నారుల వివరాలను పోషణ ట్రాకర్ యాప్ ద్వారా నమోదు చేయడానికి వీటిని ఉపయోగించనున్నట్లు తెలిపారు. తదుపరి 211 అంగన్వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు యూనిఫామ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్నారుల ఆరోగ్యం, పోషణ, విద్యా అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఆఫీసర్ సిడిపిఓ రేఖల మమత, సూపర్వైజర్లు, మిర్యాలగూడ మండల పరిధిలోని అంగన్వాడీ టీచర్లు, అర్బన్ టీచర్లు పాల్గొన్నారు.

# ఘనంగా మంగళ్ పాండే వర్ధంతి



**మహేశ్వరం, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మహేశ్వరం కేంద్రంలో స్వాతంత్ర సంగ్రామ వీరుడు మంగళ్ పాండే 170వ వర్ధంతి సందర్భంగా ఘన నివాళి అర్పించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కాకి ఈశ్వర్ ముదిరాజ్ మాట్లాడుతూ, మంగళ్ పాండే త్యాగాలు దేశ చరిత్రలో చిరస్మరణీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అల్లే బిక్షపతి, అల్లే కుమార్, బంగారుగళ్ల లాజర్, రాజు నాయక్, స్వర్ణగంటి సుభాష్, కర్రెల రాములు, పేయ్యాల దేవేందర్, గదగూటి హరికృష్ణ, షేక్ హాజీ బాబా, శెట్టి అశోక్, పుట్లగారి చందు, కాకి మల్లేష్, మునావత్ అనిల్, గగనం ఆంజనేయులు, పినమోని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## డంప్ యార్డును దూరంగా తరలించాలని కలెక్టర్కు విజ్ఞప్తి



**కరీంనగర్ , ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హుజూరాబాద్ పట్టణ శివారులోని సిర్సపల్లి ప్రాంతంలో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ను తరలించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రాతో సమావేశమయ్యారు. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసిన ప్రణవ్, డంపింగ్ యార్డు వల్ల పంటలకు, రైతులకు, జనావాసాలకు కలిగే నష్టాలను వివరించారు. ఈ సమస్యపై ఇప్పటికే మంత్రులతో, మున్సిపల్ శాఖ అధికారులతో పలుమార్లు చర్చించినట్లు తెలిపారు. డంప్ యార్డ్‌ను జీవన ప్రమాణాలకు దూరంగా తరలించాలని మరోసారి విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ పూర్తి నివేదిక తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం



**తుక్కుగూడ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పహాడీషరీఫ్ పోలీస్ స్టేషన్ పరిధిలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్సై, జెడ్‌సిసి సభ్యులు, సైబర్ సింబా బృందం, పోలీస్ సిబ్బంది కలిసి శ్రీరామ్ కాలనీ, మామిడిపల్లి, తుక్కుగూడ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు చైతన్యం కల్పించారు. నకిలీ లింకులు, ఓటీపీ గోప్యత, సోషల్ మీడియా మోసాలు, ఆన్‌లైన్ బ్యాంకింగ్ జాగ్రత్తలు, ఉద్యోగాల పేరిట జరిగే స్కామ్‌లు, "డిజిటల్ అరెస్ట్" మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకవేళ ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే తొలి గంటలోనే సైబర్ క్రైమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని, హెల్ప్‌లైన్ 1930కు కాల్ చేయాలని సూచించారు. ప్రజల నుండి విశేష స్పందన లభించగా, ప్రతి పౌరుడికి అవగాహన కల్పించే వరకు ఈ కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తామని పోలీసులు తెలిపారు.

## మునగల కొండలరావుడిగ్రీ కళాశాలలో జాబ్ మేళా గోడ పత్రిక ఆవిష్కరణ




**దేవరకొండ ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్).** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించనున్న జాబ్ మేళాకు సంబంధించిన గోడ పత్రికను బుధవారం దేవరకొండలోని ఎం.కె.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లో ఆవిష్కరించారు. కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి, కోఆర్డినేటర్ డాక్టర్ వి. మకట్లాల్‌తో కలిసి ఈ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి మాట్లాడుతూ.. సార్వత్రిక విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ఇదొక మంచి అవకాశమని పేర్కొన్నారు. చదువుతో పాటు అప్రెంటిస్ కింద వివిధ రంగాల్లో పని అనుభవం, ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆయన తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులందరూ ఈ జాబ్ మేళాను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తీవ్ర ఎండ తాపానికి గణేష్‌నగర్‌లో చలివేంద్రం ఏర్పాటు



**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ఎండాకాలంలో బాటసారులకు దాహార్తి తీర్చేందుకు విశ్వబ్రాహ్మణ అఫీషియల్స్ ఒ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్‌నగర్‌లోని రావిచెట్టు దగ్గర చలివేంద్రం ఏర్పాటు చేశారు. 57వ డివిజన్ కార్పొరేటర్ కొలిపాక రమ్యశ్రీ శ్రీనివాస్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవికాలంలో ప్రజలకు ఉపశమనం కలిగించేలా చలివేంద్రాలను ఏర్పాటు చేయడం మంచి కార్యక్రమమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివో పిఏ రాష్ట్ర కన్వీనర్ వేములవాడ ద్రోణ చారి, జిల్లా అధ్యక్షుడు గద్దె సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి గాలిపల్లి శంకర్, ఆర్థిక కార్యదర్శి యాస్వాడ అంజయ్య, ఇతర కార్యవర్గ సభ్యులు, సంఘ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# సిపిఐ పార్టీకి విరాళాలు ఇవ్వాలని పిలుపు



**మర్రిగూడ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మర్రిగూడ మండలంలోని శివన్నగూడ గ్రామంలో ఇంటింటి సిపిఐ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ, భారత కమ్యూనిస్టు పార్టీ వందేళ్లుగా రాజీలేని పోరాటాలు చేస్తూ కార్మికులు, రైతులు, మహిళలు, విద్యార్థులు, యువజన సంఘాలను నిర్మించి సమ సమాజ స్థాపనకు కృషి చేస్తోందని తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం విరాళాలు అందించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బుర్ర శేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఈదుల బిక్షంరెడ్డి, అయితగోని వెంకటయ్య, బెల్లం యాదయ్య, నల్లబోతు కొమరయ్య, గున్నబోయిన శ్రీను, ఊరిపక్క ఏసు, గోల్కొండ రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్ మంత్రిత్వ శాఖ సమావేశంలో హుస్సేన్ నాయక్




**న్యూ ఢిల్లీ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ విద్యుత్ మంత్రిత్వ శాఖ సమన్వయంతో షెడ్యూల్డ్ తెగల రాజ్యాంగ రక్షణల అమలుపై జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కమిషన్ ఛైర్మన్ అంతర్ సింగ్ ఆర్య అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో కమిషన్ సభ్యులు కూడా పాల్గొన్నారు. విద్యుత్ రంగంలో షెడ్యూల్డ్ తెగల హక్కులు, సంక్షేమానికి సంబంధించిన కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

## ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు



**దేవరకొండ ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
దేవరకొండ మండలం, మైనంపల్లి గ్రామంలో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సర్పంచ్ కొర్ర రాంసింగ్ నాయక్ మాట్లాడుతూ అందరూ మంచి పౌష్టికాహారం తీసుకోవాలని అదేవిధంగా చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అంబేద్కర్. ఎం.ఎల్.హెచ్.పి. స్వాతి, ఏఎన్ఎం విజయ, వార్డు సభ్యులు పులిజాల నాగరాజు, పులిజలా సంతోష, వెంకట్,కొర్ర లక్ష్మీ, ప్రశాంత్, మూడవత్ దాసు నాయక్,ఉపాధ్యాయులు భాగ్యలక్ష్మి, జగదీష్, ఆశ కార్యకర్తలు అలివేలు,ఝాన్సీ వెంకటమ్మా, తదితరులు పాల్గొన్నారు.

## నూతన పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**నల్లగొండ ఏప్రిల్ 08 ( నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నల్లగొండ పట్టణంలో మాన్యంచల్క లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన,సమయానుకూల వైద్య సేవలు అందించాలనే ప్రభుత్వ సంకల్పానికి ఇది మరో ముందడుగు అని ఈ ఆరోగ్య కేంద్రం ద్వారా పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయన్నారు. ప్రతి కుటుంబానికి ఆరోగ్య భద్రత కల్పించడం లక్ష్యంగా ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని సుమారు రెండు కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ అధునాతన భవన నిర్మాణం చేపట్టడం జరిగిందని దీని ద్వారా పేద ప్రజలకు ఉచిత పరీక్షలు ,మందులు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ లు శ్రీనివాస్, అశోక్ రెడ్డి, కార్పొరేషన్ మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి వైద్య అధికారులు పాల్గొన్నారు.

## రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయం

**-- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**



**నల్లగొండ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి నల్లగొండ మండలంలోని జి. చెన్నారం, కనగల్, ఎడవల్లి, కురంపల్లి గ్రామాల్లో డిసిఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి సరైన మద్దతు ధర అందించడమే కాకుండా, మధ్యవర్తుల జోక్యం లేకుండా నేరుగా కొనుగోలు చేసే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని తెలిపారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని, వారి శ్రమకు తగిన ఫలితం అందేలా అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, అదనపు కలెక్టర్లు జే. శ్రీనివాస్, అశోక్ రెడ్డి, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, వ్యవసాయ శాఖ అధికారులు, మాజీ జెడ్పిటిసి సభ్యులు, గ్రామ సర్పంచులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్ బడుగుచంద్రశేఖర్



**నల్లగొండ,ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఎండలు తీవ్రమైన దృశ్యం నిత్యం కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజల కోసం తీర్చేందుకు నల్గొండ కలెక్టరేట్ కార్యాలయంలో చలివేంద్రం ప్రారంభించిన జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, అదనపు కలెక్టర్ లు శ్రీనివాస్, అశోక్ రెడ్డి కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలు తెలుసుకోవడానికి ఇంటింటికి సిపిఐ

**-తూం బుచ్చిరెడ్డి.**




**దేవరకొండ ఏప్రిల్ 08. (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
డిండి మండల కేంద్రంలో సిపిఐ ప్రజాభవన్ లో నిర్వహించినటువంటి డిండి మండల కౌన్సిల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తూం బుచ్చిరెడ్డి పాల్గొని ఆయనమాట్లాడుతూ పార్టీ బలోపేతానికి రాష్ట్ర సిపిఐ పార్టీ ఇంటింటికి సిపిఐ అనే నినాదంతో ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుంటూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చెయ్యాలని ఆదేశించడం జరిగింది.ఏప్రిల్ 1 నుండి ఇంటింటికి సిపిఐ ఉద్యమాలకు పోరాటాలకు చేయూతగా విరాళాలు ఇవ్వండి ఆదరించి పార్టీ బలోపేతానికి అందరూ సహకరించాలని రాష్ట్రవ్యాప్తంగా గడపగడపకు సిపిఐ వెళ్తుందని ప్రజల సమస్యలే పరిష్కార ద్యేయంగా ఈ మహత్తర కార్యాన్ని తలపెట్టిందని మండలంలోని అన్ని గ్రామాల్లో గడపగడపకు సిపిఐ వెళ్లాలని ఆయన అన్నారు. యుద్ధ ప్రాతిపదికన రెవెన్యూ సదస్సులు నిర్వహించిన రాష్ట్ర ప్రభుత్వం ఆశించిన మేరకు సక్సెస్ కాలేకపోయింది ఎక్కడ ఏసిన గొంగడి అక్కడే ఉన్నట్టు ఒక్క ఫైల్ కూడా పరిష్కారం కాలేదు అధికారుల నిర్లక్ష్యమా లేక ప్రభుత్వ నిర్లక్ష్యమా రైతులు ఈ విషయంలో ఆఫీసర్ల చుట్టూ ఆఫీసుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు వారి సమస్యలు పరిష్కారం అయ్యేది ఎప్పుడు రైతులు వెళ్లి రెవెన్యూ సదస్సుల సమస్యలపై అడిగితే వాటి గురించి మర్చిపోండి అవి పరిష్కారం కావు అని నిర్మొహమాటంగా అధికారులు రైతులకు చెప్పడం జరుగుతుందని వెంటనే పై అధికారుల స్పందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నాము.ఈ సమావేశానికి అధ్యక్షత తిప్పర్తి విజేందర్ రెడ్డి వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం అధ్యక్షులు యండి మైనోద్దీన్,సిపిఐ డిండి మండల కార్యదర్శి శ్రీరామదాసు కనకాచారి,సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్, ఏఐటియుసి జిల్లా సహాయ కార్యదర్శి నూనె వెంకటేశ్వర్లు, ఏఐవైఎఫ్ నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షులు ఎనమల్ల నవీన్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షులు సురిగి వినయ్ కుమార్,సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శిలు వంకేశ్వరం చక్రి,దుబ్బ లక్ష్మారెడ్డి,యండి బాబా,వై.మధుసూదన్ రెడ్డి,ఎల్. శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన సలహా మండలి సమావేశం

**ఎమ్మెల్యే బాలు నాయక్.**



**దేవరకొండ ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
తెలంగాణ సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన గిరిజన సలహా మండలి (టిఎసి) సమావేశంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని అటవీ ప్రాంత సమస్యలతో పాటు పర్యాటక రంగ అభివృద్ధిపై పలు అంశాలను చర్చించారు .వైజాగ్ కాలనీ ఎకో-టూరిజం ప్రాజెక్టు నాగార్జునసాగర్ వెనుక జలాల తీరాన ఉన్న వైజాగ్ కాలనీ ఎకో-టూరిజం ప్రాజెక్టు పనులు ప్రస్తుతం నిలిచిపోయాయని, వాటిని తక్షణమే పునఃప్రారంభించాలని కోరారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే స్థానిక గిరిజన యువతకు ఉపాధి పెరగడమే కాకుండా, దేవరకొండ పర్యాటక హబ్‌గా మారుతుందని పేర్కొన్నారు.

అటవీ భూముల సమస్యలు దేవరకొండ నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో గిరిజనులు ఎదుర్కొంటున్న భూ సమస్యలను, ఇతర అటవీ సంబంధిత ఇబ్బందులను కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటికి శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

**పర్యాటక ప్రాజెక్టుల విస్తరణ:**
దేవరకొండ అటవీ ప్రాంతంలోని సహజ సిద్ధమైన ప్రదేశాలను గుర్తించి, మరిన్ని కొత్త పర్యాటక ప్రాజెక్టులను చేపట్టాలని కోరారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే లలు,అటవీ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి స్టేడియంలో అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ ప్రారంభం




**గోదావరిఖని, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సామాజిక సమతా వేదిక ఆధ్వర్యంలో సింగరేణి స్టేడియంలో జరుగుతున్న అంబేద్కర్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలను పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ ప్రారంభించారు. క్రికెట్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు ఘన స్వాగతం పలికి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వంశీకృష్ణ మాట్లాడుతూ, పార్లమెంట్‌లో తెలంగాణకు రావలసిన నిధులపై గళమెత్తినట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు కేటాయిస్తూ తెలంగాణపై అన్యాయం జరుగుతోందని విమర్శించారు. రాష్ట్రంలో ఒక్క ఎయిర్‌పోర్ట్ మాత్రమే ఉండగా ఆంధ్రలో తొమ్మిది విమానాశ్రయాలు ఉండటం అన్యాయమని అన్నారు.రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో ఈఎస్ఐ ఆసుపత్రి కోసం పలుమార్లు ప్రస్తావించినా నిధులు కేటాయించడం లేదని, కార్మికుల సంక్షేమం కోసం ఆసుపత్రి వచ్చేంతవరకు పోరాటం చేస్తామని చెప్పారు. సింగరేణి విశ్రాంతి కార్మికులకు రూ.10,000 పెన్షన్ ఇవ్వాలని, ఆదాయ పన్ను మినహాయింపు కోసం కూడా పార్లమెంట్‌లో ప్రస్తావించినట్లు తెలిపారు. పెద్దపల్లి ప్రజల ఆశీర్వాదం ఎల్లప్పుడూ తనకు ఉండాలని కోరుకుంటూ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని వంశీకృష్ణ స్పష్టం చేశారు.

## అట్టడుగు వర్గాల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

**-- షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



**షాద్‌నగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ అసెంబ్లీలో ఏం.బి.సి కులాల అభివృద్ధి కార్పొరేషన్ పథకాలపై సమీక్ష సమావేశం షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ నేతృత్వంలో జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా నాయి బ్రాహ్మణులు, రజకులు వంటి వెనుకబడిన వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని, కేటాయించిన బడ్జెట్ ల్యాప్స్ కాకుండా ప్రజలకు చేరేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. త్వరలో బీసీ సంక్షేమ శాఖతో ఉపకులాల స్థాయిలో సమావేశాలు నిర్వహించి నివేదిక సమర్పిస్తామని తెలిపారు.సమావేశంలో శాసన సభ్యులు తోట లక్ష్మీకాంత రావు, పట్లోల సంజీవ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మాయాదేవి, సీఈఓ అలోక్ కుమార్, ఫైనాన్స్ కమిషన్ మేనేజింగ్ డైరెక్టర్ మల్లయ్య భట్టు, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ ఇందిరా, అసెంబ్లీ డిప్యూటీ సెక్రటరీ రఘుమ రెడ్డి, ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు



**మర్రిగూడ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండలంలోని దామెర భీమనపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని భీమ్లా తండాలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్య వివాహాల నిరోధం, లైంగిక వేధింపుల నివారణ, చట్టబద్ధమైన దత్తతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అలివేలు, ఐసిడిఎస్ సూపర్వైజర్ యశోద, ప్రతినిధులు రాము, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మట్టి తరలింపు వాహనాల సీజ్



**మర్రిగూడ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండలంలోని శివన్నగూడ రిజర్వాయర్ నుంచి అనుమతి లేకుండా మట్టిని తరలిస్తున్న మూడు ట్రాక్టర్లు, ఒక జెసిపిని పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మర్రిగూడ ఎస్సై మునగాల కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం, ప్రాజెక్టు ప్రాంతంలో తనిఖీలు నిర్వహించి వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించి యజమానులపై కేసులు నమోదు చేశారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి, ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులకు నోటిఫికేషన్

**- ఆమనగల్లులో నలుగురికి అవకాశం**



**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు మున్సిపాలిటీలో నాలుగు కో ఆప్షన్ సభ్యులకు మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్ బుధవారం నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏప్రిల్ 9వ తేదీ నుంచి 15వ తేదీలోగా అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించారు. రెండు మైనార్టీ కో ఆప్షన్ పోస్టులు (ఇందులో ఒక్కరు మహిళ తప్పనిసరి), మరో రెండు పురపాలక పరిపాలనలో పరిజ్ఞానం అనుభవం ఉన్న వారికి అవకాశం కల్పించారు. ఇందులోనూ ఒక్కరు మహిళా అభ్యర్థి అయి ఉండాలి. మైనార్టీలకు రెండు, ఇతరులకు రెండో కో ఆప్షన్ పోస్టులను నోటిఫికేషన్ జారీ అయింది. కో ఆప్షన్ పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు.

# ఇచ్చిన మాట ప్రకారం మంచినీటి సౌకర్యం



**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల్లో ఇచ్చిన హామీని కౌన్సిలర్ ఎర్రవోలు మహేష్ నిలబెట్టుకున్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ 9వ వార్డు వెంకటగిరి కాలనీలో ప్రతి ఇంటికి మంచినీటి పైపు కనెక్షన్ పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ మహేష్ మాట్లాడుతూ.. వార్డులోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే ధ్యేయమని, నిత్యం ప్రజల కోసమే జీవిస్తానని, వారి సమస్యలను పరిష్కరించడమే తన లక్ష్యమని అన్నారు.

# వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి'

**- సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పాలకుర్ల మహేందర్ గౌడ్ అన్నారు. బుధవారం కడ్తాల్ మండలం పల్లె చెల్క తాండలో కామినేని హాస్పిటల్ డాక్టర్ సందీప్ సహకారంతో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మహేందర్ గౌడ్ మాట్లాడుతూ.. నేడు మనం తీసుకునే ఆహారం, వాతావరణంలో వస్తున్న మార్పులు, ఇతర కాలుష్యాల వలన ప్రతి ఒక్కరు అనారోగ్యాల బారిన పడుతున్నారని, ఇలాంటి పరిస్థితిలో ఆరోగ్యం పట్ల నిర్లక్షం వద్దని, ప్రతిఒక్కరూ ఎప్పటికప్పుడు వైద్య పరీక్షలు చేసుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నిరుపేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో కామినేని ఆస్పత్రి సహకారంతో వైద్య శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత ప్రజలు వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి అద్దాల రాములు గౌడ్, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్, యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రమేష్ నాయక్, మాజీ ఉప సర్పంచ్ డిప్ల నాయక్, సీతారాం నాయక్, వార్డు సభ్యులు మోతిలాల్ నాయక్, గోపాల్ నాయక్, మాన్య నాయక్, వెంకటయ్య గౌడ్, పాండు నాయక్, యాదయ్య, బాలు నాయక్, భాస్కర్ నాయక్, భాన్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో వ్యవసాయ పరిస్థితులపై కమిషన్ సమీక్ష



**హైదరాబాద్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తెలంగాణ వ్యవసాయ & రైతు సంక్షేమ కమిషన్ ఆధ్వర్యంలో "తెలంగాణలో వ్యవసాయ పరిస్థితి -- ప్రస్తుత స్థితి మరియు భవిష్యత్తు" అంశంపై సమీక్ష సమావేశం బీఆర్కేఆర్ భవన్‌లో జరిగింది. రాష్ట్ర వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు, 2034 ఢ 2047 లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని వ్యూహాలు చర్చించబడ్డాయి. మట్టి ఆరోగ్యం, సహజ వ్యవసాయం, పంటల వైవిధ్యం, కనీస మద్దతు ధర, కొనుగోలు వ్యవస్థ బలోపేతం వంటి అంశాలు ప్రధానంగా ప్రస్తావించబడ్డాయి. వరి ఆధారాన్ని తగ్గించి మిల్లెట్స్, పప్పులు, నూనె గింజలకు ధర హామీ, మార్కెట్ సౌకర్యాలు కల్పించాలని సూచించారు. విత్తనాల నాణ్యత, =ఢణ బలోపేతం, రైతుల ఫిర్యాదుల పరిష్కారానికి కమిటీలు ఏర్పాటు చేయాలని సిఫారసు చేశారు. హార్టికల్చర్ విస్తరణ, విలువ ఆధారిత ఉత్పత్తులు, కోల్డ్ చైన్, గ్రామీణ మార్కెట్లు, టెనెంట్ రైతులకు రుణాలు, మహిళా రైతులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు, వాతావరణ అనుకూల పంటల ప్రోత్సాహం వంటి అంశాలపై దృష్టి సారించారు. కమిషన్ ఈ సూచనలన్నింటినీ సమగ్ర నివేదిక రూపంలో రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పించనున్నట్లు తెలిపింది. సమావేశంలో కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు రాములు నాయక్, కేవీఎన్ రెడ్డి, గోపాల్ రెడ్డి, భూమి సునీల్, భవానీ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, వ్యవసాయ శాఖ అధికారులు, ఇక్రిశాట్ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

# నిబంధనలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవు

**-- ఎస్పీ శరత్ చంద్ర పవార్**



**నల్లగొండ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జిల్లా వ్యాప్తంగా మోడిఫైడ్ సైలెన్సర్లపై ప్రత్యేక డ్రైవులు నిర్వహించిన ఎస్పీ శరత్ చంద్ర పవార్ వందల సంఖ్యలో వాహనాలను స్వాధీనం చేసుకొని గడియారం సెంటర్లో తొక్కించారు. ఇకముందు ఎవరైనా మోడిఫైడ్ సైలెన్సర్లు ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ వాహనం నడిపే సమయంలో హెల్మెట్ ధరించి, ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని సూచించారు. శబ్ద కాలుష్యం సృష్టించే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరామిరెడ్డి, సీఐలు రాఘవరావు, మహా లక్ష్మయ్య, రాజశేఖర్ రెడ్డి, ఎస్ఐలు సైదులు, రాజీవ్ రెడ్డితో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నేడు ఎన్ఎస్ఈయుఐ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**- రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్**



**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
కాంగ్రెస్ పార్టీ విద్యార్థి విభాగం ఎన్ఎస్ఈయుఐ 56వ దినోత్సవ వేడుకలు నేడు (గురువారం) ఎన్ఎస్ఈయుఐ రాష్ట్ర కార్యదర్శి ఎండి ఫరీద్ అధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఆయన బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు ఉదయం 10:30 గంటలకు పట్టణ కేంద్రంలోని రాజీవ్ గాంధీ చౌరస్తాలో ఎన్ఎస్ఈయుఐ జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ మరియు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పాలు, పండ్లు, బ్రెడ్లు పంపిణీ ఉంటుందన్నారు. ఈ వేడుకలకు టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్, మాజీ జడ్పిటిసి సభ్యులు శ్రీపతి శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ఈయుఐ నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఫరీద్ కోరారు.

# గాలికుంటు నివారణ టీకా తప్పనిసరి



**ఎలిగేడు, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలంలోని సుల్తానాపూర్ గ్రామంలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో బుధవారం పశువులకు గాలికుంటు నివారణ టీకా వేశారు. గ్రామంలో 125 పశువులకు టీకా వేసినట్లు పశువైద్యాధికారిణి రూప్సి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కవ్వంపల్లి బాపయ్య, ఉపసర్పంచ్, పశుమిత్ర పెద్ది సమ్మయ్య, పశుపోషకులు పాల్గొన్నారు.

## దెబ్బతిని అస్తవ్యస్తంగా మారిన కరీంనగర్ తీగల వంతెన రోడ్డు



**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
గత బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో నిర్మించిన కేబుల్ బ్రిడ్జి (తీగల వంతెన)ను అప్పటి ఐటీ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ప్రారంభించారు. అయితే కొద్ది కాలంలోనే అధిక లోడుతో వెళ్తున్న లారీలు, ట్రక్కుల కారణంగా రోడ్డు దెబ్బతిని అస్తవ్యస్తంగా మారింది. ప్రస్తుతం వాహనదారులు వచ్చే రాకపోకలలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం త్వరగా పనులు పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

# పోచమ్మ ఆలయానికి దర్వాజా ఏర్పాటు



**ఎలిగేడు, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం లాలపల్లి గ్రామంలో పోచమ్మ దేవత ఆలయ నిర్మాణంలో భాగంగా బుధవారం ఆలయానికి వైభవంగా దర్వాజా ఏర్పాటు చేశారు.సర్పంచ్ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముత్కల రమ్య, వార్డు సభ్యులు, కుల సంఘాల పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## అగస్త్య ఆసుపత్రిని ప్రారంభించిన వంశీచంద్ రెడ్డి





**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పేద ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానీతులు చల్లా వంశీచంద్ రెడ్డి సూచించారు. తలకొండపల్లి ఎక్స్ రోడ్డు వద్ద నూతనంగా నెలకొల్పిన అగస్త్య ఆసుపత్రిని సిడబ్ల్యూసి ప్రత్యేక ఆహ్వానీతులు చల్లా వంశీచంద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలకు తక్కువ ధరతో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేయాలని యాజమాన్యం డాక్టర్ జంప్ల నాయక్, సీటీ సర్జన్ మంజుల మేనేజింగ్ డైరెక్టర్ లకు సూచించారు. అనంతరం ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ లు వేరు వేరుగా ఆసుపత్రిని సందర్శించి సదుపాయాలను పర్యవేక్షించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలందించడంలో పోటీ పడాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో వైభవంగా ఎల్లమ్మ పట్నం



**ఎలిగేడు, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు మండలం నర్సాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో కళ్యాణ మహోత్సవం, పట్నం బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. బైండ్లపూజారులు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గౌడ కులస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఎల్లమ్మతల్లి కథను భక్తులకు వినిపించారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, రైతులకు పాడి పంటలు సమృద్ధిగా రావాలని ఆయన ప్రార్థించారు.కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ పల్లెర్ల వెంకటేష్ గౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు పల్లెర్ల వెంకటయ్య గౌడ్, ఉపాధ్యక్షుడు బుర్ర సదానందం గౌడ్, సభ్యులు కాటం అంజయ్య గౌడ్, మొగిలి గౌడ్తో పాటు యూత్, మహిళలు పాల్గొన్నారు.

# బాబోయ్..కుక్కలు





- ఆమనగల్లులో కుక్కల స్వైరవిహారం
- చిన్నారులు, పశువులపై దాడులు
- భయభ్రాంతులకు గురవుతున్న పట్టణ ప్రజలు
- నివారణ చర్యలు తీసుకోవాలని వేడుకోలు





**ఆమనగల్లు, ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
ఆమనగల్లు పట్టణంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. దీంతో పట్టణ ప్రజలు బెంబే లెత్తుతున్నారు. వీధుల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తూ చిన్నారులు, వాహనదారులు, పశువులపై దాడి చేస్తున్నాయి. పట్టణంలో ఏ వీధిలో చూసినా పదుల సంఖ్యలో కుక్కలు సంచరిస్తున్నాయి. రాత్రి వేళలో రోడ్లపై గుంపులుగా తిరుగుతూ వచ్చీపోయే వారిపై దాడి చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. వీధి కుక్కల బెడదతో బయటకు వెళ్లిన వారు క్షేమంగా ఇంటికి చేరలేని పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానిక అధికారులు, నాయకులకు విన్నవించినా అరికట్టలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో పలు చోట్ల వీధి కుక్కల దాడిలో పలువురు చిన్నారులు బలయ్యారనే వార్తలు వస్తూనే ఉన్నా అధికారులు వాటి నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులు కుక్కల సంఖ్య పెరగకుండా బర్త్ కంట్రోల్ సర్జరీలు చేయాల్సి ఉన్నా తగు చర్యలు తీసుకోవడం లేదని తెలుస్తోంది. ఇక మున్సిపాలిటీ అధికారులు అప్పుడప్పుడు కుక్కలను పట్టించి తరలిస్తున్నా అవి నెల రోజుల తర్వాత మళ్లీ వచ్చి యధావిధిగా పట్టణంలోనే సంచరిస్తున్నాయని పట్టణవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## త్రివర్ణ పార్కులో నూతన కౌన్సిలర్లకు ఘన సన్మానం



**మానుకోట, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించిన 21, 22, 33, 36వ వార్డు కౌన్సిలర్లకు త్రివర్ణ పార్కు వర్కర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘన సన్మానం జరిగింది.ఈ సందర్భంగా వాకర్స్ బాధ్యులు పార్కులో శుభ్రత, వ్యాయామ పరికరాల మరమ్మత్తు, లైట్లు, టాయిలెట్స్ ఏర్పాటు వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు.సన్మానం స్వీకరించిన కౌన్సిలర్లు పార్కు అభివృద్ధికి కట్టుబడి ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 21వ వార్డు కౌన్సిలర్ జాకీర్, 22వ వార్డు కౌన్సిలర్ పద్మం ధనలక్ష్మి ప్రవీణ్, 33వ వార్డు కౌన్సిలర్ అజయ్ సారథి, 36వ వార్డు కౌన్సిలర్ ముత్యం వెంకన్న పాల్గొన్నారు.

## రౌడీ షీటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ జిల్లా కోర్టు న్యాయవాదుల నిరసన




**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
వేములవాడ బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పిట్టల భూమేష్‌పై రౌడీ షీటర్ చేసిన అనుచిత వ్యాఖ్యలు, బెదిరింపులను ఖండిస్తూ కరీంనగర్ బార్ అసోసియేషన్ న్యాయవాదులు బుధవారం నిరసన తెలిపారు.జిల్లా కోర్టు ఆవరణలో న్యాయవాదులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి చంద్రపాటి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. న్యాయవాదులపై ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, సంబంధిత వ్యక్తులపై పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని అసోసియేషన్ అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ డిమాండ్ చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బండ శివకుమార్, కార్యవర్గ సభ్యులు బెజ్జంకి శ్రీకాంత్, అనురాధ, బి. శాంతికుమార్, బెజ్జంకి శ్రీనివాస్, న్యాయవాదులు ఎల్. రాజేశం, పూరెల్లి రాములు, కల్లేపల్లి లక్ష్మయ్య, తుమికి పవన్, పి. వేణుగోపాల్, బి. రాంబాబు, బాకం సంపత్, యం. వేణుగోపాల్, బి. వేణు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు

## అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు

సిఐ బీసన్న . డిండి సర్కిల్.



**దేవరకొండ ఏప్రిల్ 08 (నీలగిరి ఎక్స్ ప్రెస్).**
నల్లగొండ జిల్లా డిండి మండల పరిధిలో బాపనకుంట దగ్గర ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలింపు చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను మరియు వాటికి ఎస్కార్ట్ గా ఉన్న రెండు బైకులను ఎస్ఐ సిహెచ్ బాలకృష్ణ, సిఐ బీసన్నడిండి మరియు సిబ్బంది కలసి వాటిని పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి వారిపై కేసులు నమోదు చేసి వాటిని సీజ్ చేశారు .మరియు వాటిని నడుపుతున్న ట్రాక్టరు డ్రైవర్ లు మరియు బైక్ డ్రైవర్ లపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు .పట్టుకున్న ట్రాక్టరు లలో రెండు జేత్య తండ మరియు రెండు ప్రతాప్ నగర్ లకు చెందినవి వారిపై తదుపరి చర్య గురించి మైనింగ్ డిపార్ట్మెంట్ కు పంపించి కఠిన చర్యలు తీసుకుంటాంమని,ఎవరైనా అక్రమ ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం అనీ డిండి సిఐ బిసన్న తెలిపారు.

## హెచ్‌పివి టీకా సద్వినియోగం చేసుకోండి



**ఎలిగేడు, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఎలిగేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 14 ఏళ్ల వయసు నిండిన ఆడపిల్లలకు హెచ్‌పివి వ్యాక్సిన్ వేయడం ప్రారంభమైంది.గ్రామ సర్పంచ్ కప్పల ప్రవీణ్ మాట్లాడుతూ, ఈ టీకా ద్వారా భవిష్యత్తులో క్యాన్సర్ నుంచి రక్షణ పొందవచ్చని, అందువల్ల అర్హులైన ప్రతి ఆడపిల్ల తప్పక సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# దళితుల హక్కులే మా లక్ష్యం - బీచ్చాల శ్రీనివాస్



**హుస్నాబాద్ , ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అక్కన్నపేట మండల కేంద్రంలో డి.ఏచ్.పి.ఏస్ రాష్ట్ర 2వ మహాసభల గోడపత్రికలను జిల్లా ఉపాధ్యక్షుడు బీచ్చాల శ్రీనివాస్ మండల నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులు, హత్యలు, అఘాయిత్యాల కారణంగా వారు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారని, వారి హక్కుల రక్షణ కోసం దృఢంగా పోరాడటమే దళిత హక్కుల పోరాట సమితి లక్ష్యమని తెలిపారు. పాలకులు రాజ్యాంగ చట్టాలను దళితులకు వ్యతిరేకంగా అమలు చేస్తున్నారని, దీనివల్ల పేదలకు తీవ్ర నష్టం జరుగుతోందని అన్నారు. సామాజిక న్యాయం సాధన కోసం ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. డి.ఏచ్.పి.ఏస్ రాష్ట్ర 2వ మహాసభలు ఈ నెల 17, 18 తేదీలలో వరంగల్ నగరంలో జరగనున్నాయని, ఈ మహాసభలు దళితులలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం పెంపొందించేందుకు దోహదపడతాయని తెలిపారు. ఏప్రిల్ 17న వరంగల్‌లో జరిగే భారీ బహిరంగ సభకు అక్కన్నపేట నుంచి అధిక సంఖ్యలో దళితులు తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డి.ఏచ్.పి.ఏస్ నాయకులు చుంచు కుమార్, టేకుల రమేష్, రాజ్ కుమార్, మాడుగుల రణధీర్, మేక అజయ్ తదితరులు పాల్గొన్నారు. విప్లవాభివందనాలతో -- బీచ్చాల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు, డి.ఏచ్.పి.ఏస్, సిద్దిపేట.

# మున్సిపల్‌లో డిప్యూటీ మేయర్ చాంబర్‌పై సిపిఐ ఆగ్రహం



**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగర పాలక సంస్థలో నిబంధనలకు విరుద్ధంగా డిప్యూటీ మేయర్‌కు చాంబర్ కేటాయించడం సిగ్గుచేటు చర్య అని సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు విమర్శించారు. బిజెపి రెండు నెలలు కాకముందే బిఆర్ఎస్ విధానాలను అవలంబిస్తూ ప్రజా వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటోందని వారు ఆరోపించారు. గతంలో డిప్యూటీ మేయర్ చాంబర్ ఏర్పాటు చేస్తే బిజెపి తీవ్రంగా వ్యతిరేకించి పోరాటాలు చేసినప్పటికీ, ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాలను అనుసరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ బిజెపికి అనుకూలంగా వ్యవహరించడం బాధాకరమని, ప్రజల సమస్యలను పక్కనబెట్టి అధికార దాహంతో వ్యవహరిస్తున్నారని వారు విమర్శించారు. మేయర్‌కే చాంబర్ ఉండాలని, డిప్యూటీ మేయర్‌కు చాంబర్ కేటాయించాలనే నిబంధన లేదని, ప్రజాధనాన్ని కోల్లగొట్టడానికి బిజెపి నిబంధనలను తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. డిప్యూటీ మేయర్ చాంబర్ ఏర్పాటుపై, బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నగర సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని కసిరెడ్డి సురేందర్ రెడ్డి, పైడిపల్లి రాజు, న్యాలపట్ల రాజులు ఒక ప్రకటనలో హెచ్చరించారు.

# అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం



**హుస్నాబాద్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
హుస్నాబాద్ పట్టణంలోని 13వ వార్డు పరిధిలో గల గోడం గడ్డ అంగన్వాడి కేంద్రంలో ఆరోగ్య లక్ష్మి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం 13వ వార్డు కౌన్సిలర్ బొల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. కమిటీలో 11వ వార్డు కౌన్సిలర్ పూదరి వరప్రసాద్, 2వ వార్డు కౌన్సిలర్ బూరుగు లతా కిష్ట స్వామి, తల్లులు, వీవో ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు మరియు అంగన్వాడి టీచర్ సభ్యులుగా ఉన్నారు. సమావేశంలో వార్డు కౌన్సిలర్లు, తల్లులు మరియు పిల్లలు పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా మహిళలు, పిల్లల ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన అంశాలను చర్చించి, కమిటీ ద్వారా సమగ్ర చర్యలు చేపట్టాలని నిర్ణయించారు.

# హిందూ సమ్మేళన నిర్వహణ నూతన కమిటీ ఏర్పాటు

**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
సంఘ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 26న తిమ్మాపూర్ మండలం రేణుకుంట ఉప మండలంలో జరగనున్న హిందూ సమ్మేళన నిర్వహణ కోసం కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీకి శ్రీ అభయాంజనేయ సహిత శ్రీ జేటీశ్వర కాశి విశ్వనాథ ఆలయ హిందూ సమ్మేళన సమితి అనే నామకరణం చేశారు. కమిటీ అధ్యక్షుడిగా దేవరాజు, కార్యదర్శిగా నీలం చంద్ర రెడ్డి, ఉపాధ్యక్షులుగా మల్లెతుల తిరుపతి, ఎలుక ఆంజనేయులు, కనకం కొమురయ్య, బిల్ల సంతోష్, పిస్క కృష్ణ కిషోర్, పురం కిరణ్ నియమితులయ్యారు. ఉప కార్యదర్శులుగా లుకర్ర మణికంత, నీలం జగన్ రెడ్డి, కాల్వ నరేష్, పిస్క భూమేష్, అందే శేఖర్, ఉప్పునుట్టి సాగర్ బాధ్యతలు స్వీకరించారు. కోశాధికారిగా గాజుల అజయ్, ఖండ సేవ ప్రముఖ్‌గా, మహిళా




ప్రముఖులుగా మేడిపల్లి సత్యవతి, కొమ్మెర గీతా, నీలం స్వప్న నియమితులయ్యారు. ప్రచార కార్యదర్శిగా నీలం రాంరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా మేడిపల్లి జనార్దన్ రెడ్డి, కొమ్మెర శ్రీనివాస్ రెడ్డి, మల్లెతుల చందు, కాల్వ శ్రీనివాస్ నియామకం జరిగింది. ఈ సందర్భంగా సామాజిక సమరత తెలంగాణ ప్రాంత సభ్యుడు పుల్లూరి రామారావు మాట్లాడుతూ దేశానికి ఆత్మ హిందూ ధర్మం, హిందూ సంస్కృతి అని, హిందువులు ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించుకోవడానికి ఐక్యత అవసరమని పేర్కొన్నారు. ప్రతి హిందువులో ఆత్మవిశ్వాసం, ఐకమత్యం నింపడం, దేవాలయ వ్యవస్థను పటిష్టం చేయడం, కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడం, స్వదేశీ వస్తువుల వాడకాన్ని ప్రోత్సహించడం, జాతీయ భావాన్ని పెంపొందించడం లక్ష్యంగా ఈ హిందూ సమ్మేళనం నిర్వహించబడుతోందని తెలిపారు.

# మహిళలకు కుట్టుమిషన్ నైపుణ్య శిక్షణ



**కరీంనగర్ జిల్లా, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
జమ్మికుంట మున్సిపల్ పరిధిలో మహిళ సంఘాల సభ్యులకు ఉచిత కుట్టుమిషన్ నైపుణ్య శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్, మెప్మా పిడి స్వరూప రాణి, కమిషనర్ మహమ్మద్ అయాజ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించబడింది. కార్తికేయ ఇనిస్టిట్యూట్ చైర్మన్ శరత్ కుమార్, మెప్మా ఇంచార్జ్ టి.ఏం.సి మల్లేశ్వరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఉపాధి కల్పించే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మహిళలు ఇంటి వద్ద టైలరింగ్ చేస్తూ ఉంటారని, దానిలో నైపుణ్యం పెంచుకోవడానికి ఇది గొప్ప అవకాశం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 41 మంది మహిళలకు ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు రోజులపాటు శిక్షణ ఇవ్వబడుతుంది. శిక్షణ నిర్వాహకురాలు సాధన, మెప్మా సి.ఎల్. అర్పిలు జ్యోతి, మంజులతో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ శిక్షణ ద్వారా మహిళలు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవడంతో పాటు కుటుంబ ఆర్థిక స్థితిని బలోపేతం చేసుకునే అవకాశం లభించనుంది.

## స్థానిక రైతులకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో కూరగాయల మార్కెట్ ప్రారంభం



**హుస్నాబాద్ , ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
చిగురుమామిడి మండలంలోని ఉల్లంపల్లి గ్రామ ప్రజలకు శుభవార్త. గ్రామ సర్పంచ్ అలువాల శంకర్ తెలిపారు ప్రకారం, గ్రామ ప్రజల సౌకర్యార్థం మరియు స్థానిక రైతులకు ప్రోత్సాహం కల్పించే ఉద్దేశంతో ఈరోజు నుంచి ప్రతి బుధవారం కూరగాయల మార్కెట్ నిర్వహించబడనుంది. ఈ మార్కెట్ ద్వారా గ్రామ ప్రజలకు తాజా కూరగాయలు తక్కువ ధరలకు అందుబాటులో ఉండటంతో పాటు రైతులు తమ పంటలను నేరుగా వినియోగదారులకు విక్రయించుకునే అవకాశం లభిస్తుంది. దీనివల్ల మధ్యవర్తుల సమస్యలు తగ్గి రైతులకు మరింత లాభం చేకూరుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రతి బుధవారం సాయంత్రం గ్రామపంచాయతీ పరిధిలో ఈ మార్కెట్ నిర్వహించబడుతుంది. గ్రామ ప్రజలు మరియు సమీప ప్రాంతాల వారు ఈ అవకాశాన్ని వినియోగించుకుని స్థానిక రైతులను ప్రోత్సహించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్ధికి ఇది ఒక ముఖ్యమైన అడుగు అని పేర్కొంటూ అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కానవేణి జితేందర్, వార్డు సభ్యులు సుదగోని ఇందిరా, కొత్త మధు, మాజీ ఉప సర్పంచ్ కోల వెంకటస్వామి, కొత్త బాలయ్య, కోలా ఎల్లవ్వ, ఆరెపల్లి వెంకవ్వ, గడ్డం రజిత, కమల తదితరులు పాల్గొన్నారు.

# పల్లెల అభివృద్ధి ప్రభుత్వ లక్ష్యం

-- ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**గంగాధర, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
గంగాధర మండలంలోని ఇస్లాంపూర్, కోట్ల నరసింహులపల్లి, గర్షకుర్తి గ్రామాల్లో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ భవనాలను ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అలాగే ఇస్లాంపూర్, మల్లాపూర్, వెంకంపల్లి, మధురానగర్, చర్లపల్లి(ఎన్), బూరుగుపల్లి, కోట్ల నరసింహులపల్లి, గర్షకుర్తి, కురిక్యాల, గట్టుభూత్కూర్ గ్రామాల్లో రూ.10 లక్షలతో నిర్మిస్తున్న స్వశక్తి సంఘ భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గర్షకుర్తి లో రూ.10 లక్షలు, వెంకంపల్లి లో రూ.5 లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేసిన ఎమ్మెల్యే మాట్లాడుతూ, పల్లెల అభివృద్ధి లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం



పనిచేస్తోందని తెలిపారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందని, కనీసం గ్రామపంచాయతీలకు సొంత భవనాలను కూడా నిర్మించలేదని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కేంద్రంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, ప్రతి గ్రామంలో మహిళలు సమావేశాలు నిర్వహించుకునేందుకు స్వశక్తి సంఘ భవనాలను నిర్మిస్తున్నామని చెప్పారు. చొప్పదండి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ అంబటి రజిత, ఎంపీడీవో రాము, మాజీ సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్ రావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పురుమల్ల మనోహర్, సర్పంచులు రామిడి రాజిరెడ్డి, బారాజు ప్రభాకర్ రెడ్డి, వేముల భాస్కర్, గుండా వేణి, లావణ్య తిరుపతి, ఎడవెల్లి విజయ, కాదరి రేణుక, కనకయ్య, రాచమల్ల రవి, దూలం కల్యాణ్, గునుకొండ బాబు, రెండ్ల శ్రీనివాస్, బాసవేణి శ్రీనివాస్, దానే అనసూర్య, ఒదేలు, బాబ లక్ష్మి, మధు, కవిత మల్లేశం, బిర్ల ఆనందం, అరే రాజశేఖర్, నాయకులు దుబ్బాసి బుచ్చయ్య, కర్ర విద్యాసాగర్ రెడ్డి, మేర్జ కొండయ్య, మంత్రి మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో దట్టమైన డంపింగ్ యార్డ్ పొగతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నా ప్రజలు


**కరీంనగర్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ పట్టణంలోని బైపాస్ రోడ్ వద్ద ఉన్న డంపింగ్ యార్డ్‌లో చెత్తను కాల్చడం వల్ల దట్టమైన పొగ వ్యాపిస్తోంది. దీంతో చుట్టుపక్కల కాలనీల్లో నివసిస్తున్న ప్రజలు తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. శ్వాసకోశ సంబంధిత సమస్యలు



పెరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితి కొనసాగితే ప్రజలు పెద్ద ఎత్తున అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు. డంపింగ్ యార్డ్‌ను ఇక్కడి నుంచి తొలగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని నివాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# రహస్యంగా ఇరాన్ అణు పరీక్ష!

**రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్ మెద్వెదెవ్ వెల్లడి**




**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్ రహస్యంగా అణ్వస్త్ర పరీక్ష జరిపిందని రష్యా సెక్యూరిటీ కౌన్సిల్ డిప్యూటీ చైర్మన్, మాజీ ప్రధాని దిమిత్రీ మెద్వెదెవ్ బుధవారం సంచలన వ్యాఖ్యలు చేశారు. అత్యంత శక్తివంతమైన అణ్వాయుధ పరీక్షను ఇరాన్ నిర్వహించిందని ఆయన వెల్లడించారు. అమెరికా-ఇరాన్ మధ్య రెండు వారాల కాల్పుల విరమణ ఒప్పందానికి సంబంధించిన ప్రకటన వెలువడిన కొన్ని గంటలకే ఈ సంచలన విషయాన్ని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ప్రధాన సహాయకుడు దిమిత్రి ఎక్స్ పోస్టులో బయటపెట్టారు.

## ఏ క్షణమైనా.. మళ్లీ దాడులు : నెతన్యాహు



**జెరూసలేం,ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
యుద్ధాన్ని తాత్కాలికంగా విరమణ ప్రకటించిన తర్వాత.. 11 నుంచి ఇస్లామాబాద్ వేదికగా అమెరికా-ఇరాన్ మధ్య కీలక చర్చలు సాగబోతున్నాయి. అయితే, చర్చల ప్రక్రియకు విరుద్ధంగా ఇజ్రాయెల్ నుంచి ప్రకటనలు వెలువడుతున్నాయి.'యుద్ధానికి ఇది ముగింపు కాదు. ఏ సమయంలోనైనా మళ్లీ పోరుకు దిగుతాం' అని నెతన్యాహు బుధవారం రెచ్చగొట్టే ప్రకటనలు చేశారు. రెండువారాల పాటు తాత్కాలిక యుద్ధ విరమణ ఒప్పందాన్ని పాటిస్తామని, అయితే ఇరాన్‌కు వ్యతిరేకంగా ఏ సమయంలోనైనా దాడులకు తాము సిద్ధమని నెతన్యాహు అన్నారు.

## కిడ్నాప్ అయిన యూఎస్ జర్నలిస్ట్ విడుదల



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాక్‌లో కిడ్నాప్ అయిన అమెరికాకు చెందిన మహిళా ఫ్రీలాన్స్ జర్నలిస్ట్ షెల్లీ కిటెల్సన్ విడుదల అయ్యారు. ఈ విషయాన్ని యూఎస్ విదేశాంగ మంత్రి మార్కో రూబియో ధ్రువీకరించారు. మార్చి 31న బాగ్దాద్‌లోని ఇరాక్ చెందిన మిలీషియా గ్రూపు సభ్యులు ఆమెను అపహరించారు. దీంతో ఆమె ఆచూకీ కోసం అక్కడి పోలీసులు, అమెరికా అధికారులు తీవ్రంగా శ్రమించారు. ఆమెను వెతకడంలో సహాయం చేసినందుకు ఇరాక్ అధికారులకు రూబియో ధన్యవాదాలు తెలిపారు.

# నెతన్యాహు దౌత్య వైఫల్యమే ఇది!

**ట్రంప్ ఏకపక్ష సీజ్‌ఫైర్‌పై ఇజ్రాయెల్‌లో విమర్శలు**




**జెరూసలేం ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇజ్రాయెల్‌ను పరిగణనలోకి తీసుకోకుండా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటించడం ఇజ్రాయెల్‌లో రాజకీయంగా దుమారం రేపింది. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దౌత్యపరంగా, వ్యూహాత్మకంగా విఫలమయ్యారని విపక్ష పార్టీల నేతలు మండిపడ్డారు. 'నెతన్యాహు అహంకారం, నిర్లక్ష్యం, ప్రణాళిక లేకపోవటం వల్ల ఏర్పడిన నష్టమిది. దీనిని పూడ్చుకోవడానికి కొన్ని సంవత్సరాలు పడుతుంది' అని విపక్ష నేత యైర్ లాపిడ్ విమర్శలు గుప్పించారు. మనదేశ చరిత్రలో ఇలాంటి రాజకీయ విపత్తు ఎన్నడూ సంభవించలేదు. జాతీయ భద్రతకు సంబంధించి కీలక నిర్ణయాలోను ఇజ్రాయెల్‌ను లెక్కలోకి తీసుకోలేదు. ఇదంతా ప్రధాని నెతన్యాహు దౌత్య వైఫల్యం వల్లే' అని అన్నారు. సైన్యం తన పనులన్నీ పూర్తిచేసిందని, ప్రజలు ఎంతో నిబ్బరాన్ని కనబర్చారని లాపిడ్ అన్నారు. అయితే, నెతన్యాహు నిర్దేశించుకున్న లక్ష్యాల్లో దేనినీ సాధించలేకపోయారని ఆయన అరోపించారు.

## ఇరాన్-అమెరికాల మధ్య కాల్పుల విరమణను స్వాగతిస్తున్నాం




**న్యూఢిల్లీ : ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
ఇరాన్-అమెరికాల మధ్య రెండు వారాల కాల్పుల విరమణను భారత్ స్వాగతించింది. పశ్చిమాసియాలో శాశ్వత శాంతి కోసం "ఉద్రిక్తతలను తగ్గించాలి, చర్చలు, దౌత్యం" కోసం పిలుపునివ్వాలని సూచించింది. ఈ మేరకు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ బుధవారం ఒక ప్రకటన విడుదల చేసింది. "కాల్పుల విమరణను మేము స్వాగతిస్తున్నాము. ఇది పశ్చిమాసియాలో శాశ్వత శాంతికి దారితీస్తుందని ఆశిస్తున్నాము. మేము గతంలో, నిరంతరం స్పష్టం చేసినట్లుగా.. కొనసాగుతున్న సంఘర్షణలకు త్వరగా ముగింపు పలకడానికి ఉద్రిక్తతలను తగ్గించడం, చర్చలు, దౌత్యం చాలా అవసరం" అని ఆ ప్రకటనలో పేర్కొంది. "ఈ సంఘర్షణలతో ఇప్పటికే ప్రజలు తీవ్రమైన ఇబ్బందులను ఎదుర్కొన్నారు. ప్రపంచ ఇంధర సరఫరా, వాణిజ్య నెట్‌వర్క్‌లకు అంతరాయం కలిగించింది. హార్మూజ్ జలసంధి నుండి నిరాటంకమైన నౌకాయాన స్వేచ్ఛ, ప్రపంచ వాణిజ్య ప్రవాహం కొనసాగుతుందని మేము ఆశిస్తున్నాము" అని తెలిపింది.

# అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న వ్యక్తులను బైండోవర్ చేసిన పోలీసు శాఖ



**కరీంనగర్ రూరల్, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
మానకొండూరు మండలం వెల్ది గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్, తాళ్లపల్లి అనిల్, వల్లంపహాడ్ గ్రామానికి చెందిన సంకూరి అనిల్ కుమార్, సంకూరి శ్రావణ్, బొజ్జం కుమార్, సుల్తానాబాద్ మండలం గట్టేపల్లి గ్రామానికి చెందిన మహమ్మద్ ఇలియాస్, గొల్లపల్లి గ్రామానికి చెందిన కొయ్యడ రాజశేఖర్, సైదం మహేష్, గున్నాల మల్లేష్, సెలివేరి శ్రీకాంత్ లు అక్రమ ఇసుక రవాణా చేస్తూ పట్టుబడ్డారు. వారి ట్రాక్టర్లను సీజ్ చేసి, ఒక్కొక్కరిని లక్ష రూపాయల పూచికత్తుపై కరీంనగర్ రూరల్ ఎమ్మార్వో ముందు బైండోవర్ చేశారు. అక్రమ ఇసుక రవాణా చేసే వారిపై సస్పెక్ట్ షీట్లు తెరుస్తామని, కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ రూరల్ సీఐ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. ఈ చర్యలతో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు కఠినంగా వ్యవహరిస్తున్నారని స్పష్టమవుతోంది.


## సింగరేణి కార్మిక కుటుంబాలపై ఆర్‌జీ--3 అధికారుల ఆగడాలు



**మంథని, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రామగిరి మండలం సెంటనరీ కాలనీలో మాజీ ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మొలుమూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఆర్‌జీ--3లో అధికారులు కార్మిక కుటుంబాలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సింగరేణి కార్మికుల క్వార్టర్స్‌లో వారి పిల్లలు, బంధువులు ఉంటే ప్రైవేటు వారని చెప్పి కరెంటు, నీటి సరఫరా నిలిపివేయడం, పీనల్ రెంట్ వేయడం వంటి చర్యలు తీసుకుంటున్నారని విమర్శించారు. సింగరేణి కంపెనీ 11 డివిజన్లలో ఎక్కడా లేని విధానాన్ని ఇక్కడ అమలు చేయడం విడ్డూరమని అన్నారు. యూనియన్ నాయకులు కూడా అధికారుల ఆగడాలపై స్పందించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. తాగునీటి శుభ్రత, కార్మిక సంక్షేమం వంటి అంశాలను పక్కనబెట్టి కుటుంబాలను ఇబ్బందులకు గురి చేయడం సరైనది కాదని అన్నారు. వందల క్వార్టర్స్ ఖాళీగా ఉన్నా వాటిని పట్టించుకోకుండా కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెట్టడం అన్యాయమని ఆరోపించారు. జి.ఎం, పర్సనల్ �<br>ఎస్టేట్ అధికారుల తీరు మారకపోతే భారతీయ జనతా పార్టీ తరపున జి.ఎం ఆఫీస్ ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

# ఇజ్రాయిల్ బరితెగింపు

**-24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడి**
**-254 మంది మృతి**
**-హర్మూజ్‌ను మూసివేసిన ఇరాన్**



**బీరూట్-టెహ్రాన్ ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
: అనుకున్నంతా జరిగింది. కాల్పుల విరమణ ఒప్పందం పరిధిలోకి లెబనాన్ రాదని వాదిస్తూ వచ్చిన ఇజ్రాయిల్ బరితెగించింది. ఒప్పందం కుదరిన 24 గంటల్లోనే లెబనాన్‌పై భీకర దాడికి దిగింది. బుధవారం రాత్రి పది నిమిషాల వ్యవధిలోనే లెబనాన్‌లోని పలు ప్రదేశాలపై వందకు పైగా వైమానిక దాడులు చేసింది. . ఇజ్రాయిల్ చేసిన ఈ భయానక దాడిలో 254 మంది మృతి చెందినట్లు 'అల్ జజీర' తెలిపింది. లెబనాన్ అధికారవర్గాలను ఉటంకిస్తూ ప్రచురించిన కథనంలో ఈ దాడుల్లో 1,165 మందికి పైగా గాయపడ్డారని, వీరిలో పలువురి పరిస్థితి ఆందోళన కరంగా ఉందని పేర్కొంది. దీంతో ఇరాన్ హర్మూజ్ జలసంధిని మరోమారు మూసివేసింది. కాల్పుల విరమణ ఒప్పందానికి భిన్నంగా ఇజ్రాయిల్ చేసిన దాడులకు నిరసనగా జలసంధిని మూసివేస్తున్నట్లు ప్రకటించింది. నిజా నికి అంతకు కొన్ని గంటల ముందే ఇరాన్ ఈ మేరకు ప్రకటించింది. బుధవారం ఉదయం నుండి లెబనాన్‌పై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను ప్రస్తావిస్తూ వాటిని కొనసాగిస్తే హర్మూజ్‌ను మూసివేసి, ఒప్పందం నుండి బయటకు వచ్చేస్తామని హెచ్చరించింది. అయితే, ఈ హెచ్చరికను ఏమాత్రం ఖాతరు చేయకుండా ఇజ్రాయిల్ భీకర దాడులకు తెగబడింది. 1982 తరువాత లెబనాన్‌పై ఇదే అతి పెద్ద దాడి అని చెబుతున్నారు. దాడుల్లో లెబనాన్‌లోని ప్రముఖ మత పెద్ద సాదిక్ ఆలీ నబుల్సీ మరణించారు. లెబనాన్ రాజధాని బీరూట్‌తో పాటు పలు ప్రాంతాల్లో ఈ దాడులు జరిగాయి.

## విజయవంతంగా ముగిసిన లోక్ అదాలత్



**పెద్దపల్లి, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మార్చి నెలలో నిర్వహించిన లోక్ అదాలత్ విజయవంతంగా పూర్తయిన సందర్భంగా జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లోక్ అదాలత్ నిర్వహణలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించి ప్రశంస పత్రాలను అందజేశారు. వివిధ పెండింగ్ కేసులను పరస్పర అవగాహనతో త్వరితగతిన పరిష్కరించడంలో పోలీసు శాఖ సమర్థవంతంగా వ్యవహరించిందని జిల్లా జడ్జి పేర్కొన్నారు. ప్రజలకు న్యాయం త్వరగా అందేలా పోలీసు శాఖ చేసిన కృషిని కొనియాడారు. భవిష్యత్తులో కూడా ఇదే విధంగా సేవలు అందించాలని సూచించారు. డీసీపీ మాట్లాడుతూ, అధిక సంఖ్యలో కేసుల పరిష్కారానికి న్యాయపరంగా సహకరించిన న్యాయ శాఖకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు త్వరితగతిన న్యాయం అందేలా న్యాయస్థానం, పోలీసు శాఖల మధ్య ఉన్న సమన్వయం ప్రశంసనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా జడ్జి సునీత కుంచాల, అదనపు జిల్లా జడ్జి స్వప్న రాణి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యదర్శి భావాని, జూనియర్ సివిల్ జడ్జి మంజుల, గోదావరిఖని ఏసిపి రమేష్, పెద్దపల్లి ఏసిపి కృష్ణ, సిఐలు ప్రవీణ్ కుమార్, రాజు, పిపి రాకేష్, ఎస్సైలు, పలువురు న్యాయమూర్తులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పాక్ కాదు.. డీల్ వెనుక చైనా

**-కాల్పుల విరమణకు చివరి నిమిషంలో దౌత్యం**
**-ఇరాన్‌తో నేరుగా మాట్లాడి ఒప్పించినట్లు వెల్లడి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 8 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కేవలం 10 గంటల వ్యవధిలో అమెరికా తన నిర్ణయం మార్చుకొని ఇరాన్‌తో కాల్పుల విరమణకు అంగీకరించింది. ఈ 10 గంటల్లో ఏం జరిగింది? రెండు వారాల కాల్పుల విరమణకు పాకిస్థాన్ పాత్రే కారణమని అమెరికా పేర్కొన్నప్పటికీ చివరి నిమిషంలో చైనా జోక్యమే ఈ ఒప్పందాన్ని ఖరారు చేసిందని తెలుస్తున్నది. ఇరాన్‌పై చర్చలకు ఒత్తిడి తేవడంలో చైనా ప్రమేయం ఉందా అని అడిగినపుడు అవుననే అంటున్నాను అని ట్రంప్ ఏఎఫ్‌పీతో అన్నారు. ట్రంప్ విధించిన గడువు సమీపించడం, పూర్తి స్థాయి యుద్ధం జరిగే ప్రమాదం పొంచి ఉండడంతో తప్పనిసరి పరిస్థితుల్లో చైనా నేరుగా ఇరాన్‌తో చర్చలు జరిపినట్లు ఇద్దరు చైనా అధికారులను ఉటంకిస్తూ ఏపీ వార్తాసంస్థ తెలిపింది. దీన్ని బట్టి ఇరాన్‌పై పాకిస్థాన్ కన్నా చైనాకు ప్రత్యక్ష పట్టు ఉందని తెలుస్తున్నది. నిజానికి కాల్పుల విరమణ ఒప్పంద ప్రకటనకు కొన్ని గంటల ముందే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలిలో హొర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడానికి బల ప్రయోగానికి అనుమతినిచ్చే ఒక తీర్మానాన్ని చైనా, ఇరాన్‌తో మరో మిత్రదేశమైన రష్యా కలసి అడ్డుకున్నాయి. యూఎన్ తీర్మానం ఇరాన్ పట్ల వివక్షతతో కూడుకుని ఉందని చైనా పేర్కొన్నది.


## బిజినెస్

# భారీగా లాభపడ్డ స్టాక్ మార్కెట్..
# ఒక్క రోజే రూ.17 లక్షల కోట్ల లాభం



ఇరాన్-అమెరికా మధ్య కాల్పుల విరమణ ఒప్పందం భారతీయ స్టాక్ మార్కెట్‌కు లాభాలపంట పండించింది. ఇన్వెస్టర్లకు భారీ లాభాలు తెచ్చిపెట్టింది. బుధవారం, ఎస్ అండ్ పీ బీఎస్ఈ సెన్సెక్స్ ఏకంగా 2,946.32 పాయింట్లు లాభపడి, 77,562.90 పాయింట్ల వద్ద ముగిసింది. అలాగే, ఎన్ఎస్ఈ నిఫ్టీ కూడా ఏకంగా 873.35 పాయింట్లు పెరిగి, 23,997.35 పాయింట్ల వద్ద ముగిసింది. ఏకంగా ఈ ఒక్కరోజే 4 శాతం లాభాలతో మదుపర్ల సంపద రూ.17.1 లక్ష కోట్ల వరకు పెరిగింది.దీంతో మొత్తం మార్కెట్ విలువ రూ.445.8 లక్షల కోట్లకు చేరింది. ఉదయం ప్రారంభం నుంచి మార్కెట్ లాభాల్లోనే నడిచింది. ఇంట్రాడేలో సెన్సెక్స్ 77,627.15 కోట్ల గరిష్టాన్ని తాకింది. నిఫ్టీ కూడా ఇంట్రాడేలో 24,025.15 పాయింట్ల గరిష్ఠ స్థాయికి చేరింది. ఇరాన్, అమెరికా మధ్య కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందం, పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గనుండటం వంటి పరిణామాలు మార్కెట్‌కు అనుకూలంగా మారాయి. అలాగే, కీలక వడ్డీ రేట్లను ఆర్బీఐ యథాతథంగా ఉంచడం కూడా కలిసొచ్చింది. ఇండియన్ మార్కెట్‌తోపాటు అంతర్జాతీయ మార్కెట్లు కూడా ఈ రోజు లాభాలబాటపట్టాయి. ఆసియా-పసిఫిక్ మార్కెట్లలో దక్షిణ కొరియా కోస్పి 6 శాతం, జపాన్ నిక్కీ 5 శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 3 శాతం లాభపడ్డాయి.మరోవైపు డాలర్‌తో రూపాయి మారక విలువ 47 పైసలు పెరిగి, 92.59 వద్ద కొనసాగుతోంది. కాల్పుల విరమణ ఒప్పందంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా భారీగా తగ్గిపోయాయి. అంతకుముందు రోజు బ్యారెల్ క్రూడాయిల్ ధర దాదాపు 109 డాలర్ల వద్ద ఉండగా, బుధవారం భారీగా తగ్గి 94 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. దాదాపు 16 శాతం పైగా చమురు ధర తగ్గింది. ఔన్స్ బంగారం ధర 4788 డాలర్ల వద్ద స్థిరపడింది. ఈ రోజు షేర్లలో ఇండిగో ఏకంగా పది శాతం మేర లాభాలు పొందింది.

## మళ్లీ షాకిచ్చిన బంగారం ధరలు..



బంగారం ధరలు ఊహించని షాకిచ్చాయి. గంటల వ్యవధిలోనే ధరలు మారాయి. ఇరాన్‌తో యుద్ధానికి విరామం ఇస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటన చేసిన క్రమంలో పసిడి ధరల్లో భారీ మార్పులు చోటుచేసుకున్నాయి. ఇరాన్ కూడా యుద్ధానికి గ్యాప్ ఇస్తున్నట్లు ప్రకటించింది. ఈ క్రమంలో గోల్డ్, సిల్వర్ రేట్లల్లో భారీగా హెచ్చుతగ్గులు నమోదువుతున్నాయి. బుధవారం గోల్డ్ రేట్లు ఒక్కసారిగా పెరిగాయి.ప్రస్తుతం హైదరాబాద్‌లో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,820 వద్ద కొనసాగుతోంది. నిన్న ఈ ధర రూ.1,49,840 వద్ద స్థిరపడింది. అంటే నిన్నటితో పోలిస్తే ఇవాళ ఒక్కరోజే రూ.3980 పెరిగింది. అటు 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,41,000 వద్ద కొనసాగుతోంది. నిన్న ఇదే ధర రూ.1,37,350 వద్ద కొనసాగింది. ఇవాళ ఏకంగా రూ.3650 పెరిగిందని చెప్పవచ్చు.ఇక విజయవాడ, విశాఖపట్నంలో కూడా పై ధరలు కొనసాగుతున్నాయి. ఇక చెన్నైలో ఇవాళ రూ.1,51,190 వద్ద ఉన్నాయి. నిన్న రూ.1,51,200 వద్ద స్థిరపడ్డాయి. ఇక 22 క్యారెట్ల ధర అక్కడ రూ.1,38,590గా ఉండగా.. నిన్న రూ.1,38,600గా ఉంది. అటు బెంగళూరులో 24 క్యారెట్ల ప్యూర్ గోల్డ్ ధర రూ.1,53,820గా ఉండగా.. 22 క్యారెట్ల రేట్లు చూస్తే రూ.1,41,000 వద్ద ఉన్నాయి.ఇక దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,53,970 వద్ద ఉండగా.. నిన్న ఇవే ధరలు రూ.1,49,990 వద్ద స్థిరపడ్డాయి. ఇక 22 క్యారెట్ల రేటు నిన్న రూ.1,37,500 వద్ద ఉండగా.. బుధవారం రూ.1,41,150 వద్ద కొనసాగుతున్నాయి. ఇక సిల్వర్ రేట్లు కూడా భారీగా పెరిగాయి.ఢిల్లీలో కేజీ సిల్వర్ ధర ప్రస్తుతం రూ.2.60 లక్షలుగా ఉంది. ఇది నిన్న రూ.2.50 లక్షలుగా ఉంది. నిన్నటితో పోల్చుకుంటే రూ.10 వేలు పెరిగింది. ఇక హైదరాబాద్‌లో కేజీ వెండి రూ.2,54,900గా ఉండగా.. మంగళవారం రూ.2.55 లక్షలుగా ఉంది. ఇక చెన్నైలో కూడా రూ.2.54 లక్షల వద్ద ఉంది.

# టయోటా కార్లు ప్రియం

**న్యూఢిల్లీ,**
టయోటా సంస్థ వాహన కొనుగోలుదారులకు షాకిచ్చింది. అన్ని రకాల మాడళ్ల ధరలను రూ.2.16 లక్షల వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో ఫార్చ్యూనర్, ఇన్నోవా, హైరైడర్, గ్లాంజా, టైసర్, హిలక్స్, ఎల్‌సీ 300 మాడళ్లు రెండు శాతం వరకు పెంచిందిపెరిగిన ధరలు అమల్లోకి వచ్చాయని పేర్కొంది. సంస్థ తీసుకున్న తాజా నిర్ణయంతో ఇన్నోవా క్రైస్టా రూ.39 వేల వరకు అధికం కానుండగా, ఫార్చ్యూనర్ రూ.69 వేలు, ఇన్నోవా హైక్రాస్ రూ.54 వేల వరకు, అర్బన్ క్రూజర్ హైరైడర్ రూ.5 వేల వరకు, గ్లాంజా రూ.20 వేలు, టైసర్ రూ.22 వేలు, హిలక్స్ రూ.56 వేలు, ల్యాండ్ క్రూజర్ 300 రూ.2.16 లక్షల వరకు ప్రియంకానున్నాయి.




## స్పోర్ట్స్

# బుమ్రానే వణికించిన వైభవ్ సూర్యవంశీ



ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో జరిగిన రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మ్యాచ్‌లో యువకెరటాలు సంచలనం సృష్టించారు. రాజస్థాన్ రాయల్స్ ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ, యశస్వి జైస్వాల్ విధ్వంసకర బ్యాటింగ్ చేశారు. సీనియర్ పేసర్లకు కూడా ఎలాంటి గౌరవం లేకుండా బౌండరీలు బాదేస్తూ అందర్ని ఆశ్చర్యానికి గురిచేశారు. తొలుత వర్షం కారణంగా నిన్న ఐపీఎల్‌లో రాజస్థాన్, ముంబై మధ్య జరిగిన మ్యాచ్‌ను 11 ఓవర్లకు అంపైర్లు కుదించారు. ఈ మ్యాచ్‌లో 15 ఏళ్ల కుర్రాడు వైభవ్ సూర్యవంశీ.. విధ్వంసకర ఇన్నింగ్స్ ఆడాడు. ఇప్పుడు అతడి ప్రదర్శనపై తెగ చర్చ జరుగుతోంది. టీమ్‌ఇండియా పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌లోనూ తొలి బంతికే వైభవ్ అవలీలగా సిక్సర్‌గా మరల్చడం పట్ల అందరి దృష్టిని ఆకర్షించాడు. తొలి బంతికే సిక్సర్ కొట్టిన విధానం ఇప్పుడు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతోంది. గౌహతి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో జస్‌ప్రీత్ బుమ్రా, యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ మధ్య హోరాహోరీ పోరు జరిగింది. బుమ్రా వేసిన తన మొదటి బంతిని ఎదుర్కొన్న సూర్యవంశీ ఏమాత్రం సంకోచించలేదు. అతను ఆరంభంలోనే ఒక స్లాట్ డెలివరీని అంచనా వేసి, దానిని లాంగ్-ఆన్ మీదుగా సిక్సర్‌గా మరల్చాడు. క్షణాల్లోనే ఆ క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయింది. టీమ్‌ఇండియా పేసర్ బుమ్రా ఏమాత్రం కనికరం లేకుండా ఆడిన తొలి ఇన్నింగ్స్ ఇదే అని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.
వైభవ్ సూర్యవంశీ ప్రదర్శన రాజస్థాన్ రాయల్స్ జట్టు గెలుపులో కీలకంగా మారింది. రాజస్థాన్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ రన్‌రేట్‌ను భారీగా పెంచడంతో ఇద్దరూ కృషి చేశారు. అయితే బుమ్రా బౌలింగ్‌లో ఏకంగా రెండు సిక్సర్లు బాది సూర్యవంశీ ఆటతో అందర్ని ఆకట్టుకున్నాడు. ఆ విధంగా బుమ్రా బౌలింగ్‌లో ఒకే ఓవర్‌లో ఏకంగా 12 పరుగుల రాబట్టాడు. అయితే వైభవ్ సూర్యవంశీ కేవలం 14 బంతుల్లో 39 పరుగులు రాబట్టాడు. అందులో 5 సిక్సర్లు, 1 ఫోర్ ఉంది. అయితే శార్దూల్ ఠాకూర్ బౌలింగ్‌లో లాంగ్‌ఆన్‌లో తిలక్ వర్మకు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అయితే యశస్వి జైస్వాల్.. ఆడిన 32 బంతుల్లో 77 పరుగులు చేసి రాజస్థాన్ రాయల్స్ గెలుపులో కీలక మలుపుగా మారాడు. వీరిద్దరి భాగస్వామ్యం కేవలం 5 ఓవర్లలో 80 పరుగులు రాబట్టారు.

## సత్తా చాటుతున్న సందీప్ శర్మ



ఐపీఎల్ 2026లో ఉత్కంఠ మ్యాచ్ లు జరుగుతున్నాయి. కొంతమంది బ్యాటర్లు, మరికొంతమంది బౌలర్లు తమ సత్తా చాటుతూ అటు పరుగులు, ఇటు వికెట్లు కొల్లకొడుతున్నారు. ఈ క్రమంలో ఓ ప్లేయర్ మాత్రం తనమైన శైలిలో స్టార్ ప్లేయర్లకు వరుసగా షాక్ లు ఇస్తూ దూసుకెళు న్నాడు. ఈ 32 ఏళ్ల ప్లేయర్ వచ్చిన అవకాశాలను సక్రమంగా వినియోగించుకుంటూ కీలక మ్యాచ్ ల్లో వికెట్లు తీస్తూ సత్తా చాటుతున్నాడు. అయితే, ఈ ప్లేయర్ కు భారత జట్టు తరపున ఆడే అవకాశాలు చాలా తక్కువగా వచ్చాయి. కానీ, ఐపీఎల్ లో మాత్రం తన దూకుడు చూపిస్తూ స్టార్ ప్లేయర్లకు చుక్కలు చూపిస్తున్నాడు. ఈ ప్లేయర్ ఎవరో అని ఆలోచిస్తున్నారా.. ఆయన పేరు సందీప్ శర్మ.సందీప్ వర్మ ఇప్పటి వరకు ఐపీఎల్ లో మూడు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తంగా 140 మ్యాచ్ లు ఆడి 149 వికెట్లు పడగొట్టాడు. కాగా, ఈ వికెట్లలో చాలా వరకు స్టార్ ప్లేయర్లవే ఉండడం గమనార్హం. వాళ్ల వికెట్లు తీయడం సందీప్ శర్మకు వెన్నతో పెట్టిన విద్యలా మారింది.సందీప్ శర్మ తీసిన పెద్ద పేర్లలో విరాట్ కోహ్లీ ముందున్నాడు. ఐపీఎల్ లో అత్యధిక పరుగులు చేసిన విరాట్ కోహ్లీ పాలిట విలన్ లా మారాడు. ఆ తర్వాత లిస్ట్ లో రోహిత్ శర్మ, క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లుఉన్నారు. ఆ తర్వాత లిస్ట్ లో శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ వంటి ఆటగాళ్లు ఉన్నారు.విరాట్ కోహ్లీని 7 సార్లు పెవిలియన్ చేర్చిన సందీప్ శర్మ. ఆ తర్వాత రోహిత్ శర్మను 6సార్లు ఔట్ చేశాడు. ఇక క్రిస్ గేల్, సూర్యకుమార్ యాదవ్ లను నాలుగుసార్లు ఔట్ చేశాడు. శ్రేయాస్ అయ్యర్, ఇషాన్ కిషన్ లను తలో మూడు సార్లు ఔట్ చేశాడు. అయితే, ఇక్కడ మరో ఆసక్తికర విషయం ఏంటంటే, సందీప్ శర్మ అత్యధికసార్లు ఔట్ చేసిన ఆటగాళ్లంతా టాప్ ఆర్డర్ లోనే ఉండడం గమనార్హం.

# ధోనీ రాకపై కోట్లాది మంది ఫ్యాన్స్ ఎదురుచూపు



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్లో వరుస పరాజయాలతో సతమతమవుతున్న సీఎస్కే అభిమానులకు ధోనీ రాకపై నిరాశే ఎదురవుతోంది. ప్రస్తుత సీజన్లో జట్టు పేలవ ప్రదర్శన కనబరుస్తుండటంకో అందరి దృష్టంతా ఎంఎస్ ధోనీ ఫిట్‌నెస్‌పైనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ ధోనీ లభ్యత గురించి కీలక అప్‌డేట్ ఇచ్చారు. గత 3 మ్యాచ్‌ల్లో వరుసగా ఓడిపోయిన సీఎస్కేకు ధోనీ లేకపోవడం పెద్ద లోటుగా కనిపిస్తోంది. 44 ఏళ్ల ఈ దిగ్గజ ఆటగాడు ఎప్పుడు మైదానంలోకి వస్తాడా అని కోట్లాది మంది ఫ్యాన్స్ ఆశగా ఎదురుచూస్తున్నారు.సీఎస్కే సీఈవో కాశీ విశ్వనాథన్ వెల్లడించిన వివరాల ప్రకారం.. ధోనీ ఇంకా తన గాయం నుంచి పూర్తిగా కోలుకోలేదు. “ఎంఎస్ ధోనీ కోలుకునే ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది.. అయితే ధోనీ మైదానంలోకి వచ్చే ఖచ్చితమైన సమయాన్ని ఇప్పుడే చెప్పలేమని.. దీనికి మరికొన్ని రోజులు పట్టవచ్చని సీఎస్కే సీఈవో చెప్పుకొచ్చారు. ప్రీ-సీజన్ క్యాంపులో ధోనీ మోకాలికి గాయమైందని.. అందుకే ఆయన ఇప్పటివరకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదని సమాచారం. సీఎస్కే సీఈవో ప్రకటన ధోనీ రావడానికి మరింత ఆలస్యం కావచ్చని తెలుస్తోంది. ఇది సీఎస్కే అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది.ఎంఎస్ ధోనీ అందుబాటులో లేకపోయినప్పటికీ.. మరో కీలక ఆటగాడు డెవాల్డ్ బ్రెవిస్ రీఎంట్రీపై జట్టు ఆశాభావంతో ఉంది. దక్షిణాఫ్రికాకు చెందిన ఈ యువ బ్యాటర్ గాయం కారణంగా గత కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యాడు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ వేగంగా కోలుకుంటున్నాడని.. తదుపరి మ్యాచ్ లో డెవాల్డ్ బ్రెవిస్ తుది జట్టులోకి వచ్చే అవకాశం ఉందని సీఎస్కే సీఈవో వెల్లడించారు. గత సీజన్లో డెవాల్డ్ బ్రెవిస్ 180 స్ట్రైక్ రేట్‌తో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన చేయడంతో బ్రెవిస్ రాక జట్టు మిడిలార్డర్‌కు బలాన్ని ఇస్తుందని జట్టు యాజమాన్యం భావిస్తోంది. సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ కూడా డెవాల్డ్ బ్రెవిస్ రాకపై సానుకూలంగా స్పందించారు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఫ్లెమింగ్ మాట్లాడుతూ.. బ్రెవిస్ తదుపరి పోరులో అందుబాటులో ఉంటాడని ఆశిస్తున్నట్లు వెల్లడించారు. వరుస పరాజయాలతో పాయింట్ల పట్టికలో వెనుకబడిన చెన్నై సూపర్ కింగ్స్, ధోనీ లేని లోటును పూడ్చుకుంటూ తిరిగి విజయాల బాట పట్టాలని ప్రయత్నిస్తోంది. ఏది ఏమైనా, “తలా” ధోనీ మైదానంలో ఎప్పుడు కనిపిస్తాడనే ఉత్కంఠ మాత్రం కొనసాగుతూనే ఉంది.